
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | 5



ప్రజలు ఆందోళన చెందవద్దు..



ప్రజలు ఆందోళన చెందవద్దు. వైరస్ వ్యాప్తి చెందకుండా అధికార బృందం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. గ్రామం, పౌల్ట్రీ సంబంధిత ప్రదేశాల్లో అధికారులు శానిటేషన్ ప్రక్రియ చేపట్టారు. కొద్ది రోజుల పాటు గ్రామస్తులు చికెన్, గుడ్లు తినవద్దు. పరిస్థితిని బట్టి ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. - కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి



కలెక్టరేట్ వద్ద స్టాల్ ప్రారంభిస్తున్న కలెక్టర్

18 మండలాల్లో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్స్

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన ప్రకృతి వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయ స్టాల్స్‌ను జిల్లా వ్యవసాయాధికారి మాధవరావుతో కలిసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 38,061 మంది రైతులు 40,268 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. గతేడాది నుంచి జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద విక్రయిస్తున్నారన్నారు.మోడల్ మండలం గోకవరంలో కొత్తపల్లి, కామరాజుపేట, తిరుమలాయపాలెం, ఎర్రంపాలెం, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయోత్పత్తులు విక్రయిస్తున్నట్టు డీఏవో మాధవరావు తెలిపారు.కార్యక్రమంలో జేపీ ఈ వరలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 146 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియల్ వార్షిక పరీక్షలు-2025లో భాగంగా జనరల్ విద్యార్థులకు 58 కేంద్రాల్లో కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ప్రాక్టికల్స్ నిర్వహించామని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఒకేషనల్ విభాగంతో కలిపి మొత్తం 6,287 మంది విద్యార్థులకు 146 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఎర్రకాలువ శాశ్వత పనులకు రూ. 268.5 కోట్లు ఇవ్వండి

కేంద్ర మంత్రికి ఎంపీ వినతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ శాశ్వత అభివృద్ధికి రూ. 268.5 కోట్లు ఇవ్వాలని కోరుతూ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వినతిపత్రం ఇచ్చారు. ఢిల్లీలో సోమవారం ఆయనను స్వయంగా కలసి ఎర్రకాలువ వరద ప్రభావం వల్ల జరుగుతున్న నష్టాన్ని వివరించారు. తక్షణం చేయవలసిన పనులు,వాటి వ్యయ అంచనాలు అందజేశారు.

కోరుకొండలో నరసన్న అధ్యయనోత్సవాలు 6

బాలుడి కిడ్నాప్ కలకలం 7

బర్డ్ ఫ్లూకి.. చికెన్!

కోళ్లకు వైరస్.. ఆందోళనలో జనం



రాజమహేంద్రవరం/ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చూస్తుండగానే కోళ్లు మృత్యువాతపడుతున్నాయి..ఉన్నట్టుండి తలలు వాల్చేస్తున్నాయి..కొన్ని కోళ్లు అయితే కొట్టుకుని చచ్చిపోతున్నాయి. నిన్నటి వరకూ కోళ్లతో కళకళలాడిన కోళ్ల ఫారాలు ప్రస్తుతం శ్మశానాన్ని తలపిస్తున్నాయి.ఎందుకంటే చనిపోయే కోళ్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా ప్రజల్లో ఆందోళన పెరిగింది. నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని రామకృష్ణా పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్ సోకింది.ఇది ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజాలో ఒకరకం. ఆ గ్రామంలో ఉన్న మూడు ఫారాల్లో మొత్తం 64 వేల కోళ్లు ఉండగా ఇప్పటికే సుమారు 62 వేలు చనిపోయాయి.కానూరు అగ్రహారంలో ఈ నెల ఒకటో తేదీ నుంచే కోళ్లు చనిపోతున్నట్టు అధికారులకు సమాచారం వచ్చింది.ఈ మేరకు కానూరుకు చెందిన వీఏహెచ్‌ఏ సిబ్బంది వచ్చి పరిశీలించి 83 శాంపిల్స్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ ఉన్న నేషనల్ హై సెక్యూరిటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబొరేటరీకి పంపించారు.వీటిని మూడు రకాలుగా పంపించారు. మూడు చనిపోయిన కోళ్ల శాంపిల్స్, 40 కోళ్ల ముక్కు టెస్ట్, మరో 40 కోళ్ల రెట్ట శాంపిల్స్‌ను పంపించారు. చనిపోయిన మూడు కోళ్లలో రెండు కోళ్లకు బర్డ్‌ఫ్లూ ధ్రువీకరణ అయింది.ఈ మేరకు ఆదివారం సాయంత్రం రిపోర్టు పంపారు.మిగతా శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉంది. సుమారు 10 రోజులుగా బర్డ్ ఫ్లూ ఉన్నా ప్రచారం జరిగినా పౌల్ట్రీ రైతులు, పశు సంవర్ధక శాఖాధికారులు పట్టించుకోలేదు.దీంతో పరిస్థితి ఇంత వరకూ వచ్చిందివిధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించిన పశు సంవర్ధక సిబ్బందికి షోకాజ్ నోటీసులివ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. కానూరు అగ్రహారం, నల్లజర్ల, చాగల్లు,సీతానగరం మండలం మిర్తి పాడు తదితర ప్రాంతాల్లో కోళ్లు చనిపోతున్నట్టు సమాచారం.దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.జిల్లాలో అన్ని మాంసం దుకాణాలు తనిఖీలు చేస్తున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

- కానూరులో నిర్ధారణ
- 62 వేల కోళ్లు మృతి
- 10 రోజులుగా మృత్యువాత
- యజమానుల సమాచారం
- స్పందించిన కాకినాడ సిబ్బంది
- భోపాల్ లేబొరేటరీకి శాంపిల్స్
- ఆదివారం ధ్రువీకరణ
- చికెన్ మార్కెట్ ధమాల్
- అప్రమత్తమైన అధికారులు

ఇది మనుషులకు సోకవచ్చు..

బర్డ్‌ఫ్లూ మనిషికి సోకే ప్రమాదం ఉంది. విపరీతంగా జలుబు, ఊపిరితిత్తులపై వంటి లక్షణాలు ఉంటాయి.ఇది ఒక విధమైన కరోనా లక్షణం. కానూరు అగ్రహారం పరిసర ప్రాంతాల్లైన 34 గ్రామాలకు 34 టీమ్‌లను పంపిస్తున్నాం. అక్కడ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వైద్యశాఖకు కూడా తెలిపి, అక్కడి పనివారికి కూడా పరీక్షలు నిర్వహించాం. కోళ్లఫారాలలో పనిచేస్తున్నవారికి ఎటువంటి రోగ నిర్ధారణ జరగలేదు.
- టి.శ్రీనివాస్, పశుసంవర్ధక జిల్లా అధికారి

చికెన్, గుడ్లు తినవద్దు..
కలెక్టర్ ప్రశాంతి

కొద్ది రోజుల పాటు చికెన్, గుడ్లు తినవద్దు. కానూరు అగ్రహారం గ్రామానికి 10 కి.మీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గ్రామంలో ఒక కిలోమీటరు మేర రెడ్‌జోన్‌గా.. 10 కిలోమీటర్ల పరిధిలో సర్వే లెన్స్‌జోన్‌గా ప్రకటించాం. అక్కడ పోలీసులు 144, 133 సెక్షన్లు అమల్లోకి తెచ్చారు. ఎక్కడ బర్డ్ చనిపోతున్నా అధికారులకు సమాచారం ఇవ్వండి.గత వారంలో ఇక్కడి పౌల్ట్రీల నుంచి కోళ్ల రవాణా ఎక్కడికి జరిగిందో సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించాం. 10 కి.మీ పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల్లో ఏమైనా బర్డ్‌ఫ్లూ లక్షణాలుంటే వారికి తగిన వైద్య సహాయం అందిస్తాం.రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.95429 08025 నెంబరులో డాక్టర్ భరత్ అందుబాటులో ఉంటారు. ప్రతి మండలంలోనూ ఒక టీంకి రెండు శాతం క్లోరైడ్ పిచికారీ చేయాలి.

కానూరు అగ్రహారంలో అధికారుల పరిశీలన



కానూరు అగ్రహారం పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా వచ్చాయని పశుసంవర్ధక శాఖ డీడీ ఎస్.సత్యనారాయణ తెలిపారు. పశుసంవర్ధక, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులు సోమవారం గ్రామానికి విచ్చేసి కోళ్లఫారాలను పరిశీలించి మాట్లాడారు. కిలోమీటరు పరిధిలో ఉన్న పౌల్ట్రీ కోళ్లతో పాటు నాటు కోళ్లకు వ్యాధి సోకుతుందన్నారు. ప్రస్తుతం రెండు ఫారాల్లో మిగిలిన కోళ్లను చనిపోతున్నాయన్నారు. మండలంలో మిగిలిన ఫారాలకు వైరస్ సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ డి.అచ్యుతకుమారి మాట్లాడుతూ కానూరు అగ్రహారం లోని 10 కిలోమీటర్ల పరిధిలో కోళ్లఫారాల నుంచి ఎటువంటి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కరోనా.. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఒకటే

బర్డ్‌ఫ్లూ, కరోనాకు కూడా ఒకే లక్షణాలు ఉంటాయి. ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లు మెడలు వాలేసి అకస్మికంగా ప్రాణాలు వదిలేస్తాయి. ఇది ఒక వైరస్. అంటువ్యాధి. రకరకాల కారణాలతో ఈ వైరస్ దాపురిస్తుంది.

అంగన్‌వాడీలకు గుడ్లు నిలిపివేత

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్ల పంపిణీ నిలిపివేసినట్లు స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారి కె.విజయకుమారి తెలిపారు. వారం రోజుల పాటు అంగన్ వాడీలలో ఉంటాయన్నారు.ఈ మేరకు సీడీపీవోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు.

కానూరులో పక్షుల వేట

కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామంలో కిలోమీటరు మేర ఏ రకమైన పక్షులు ఉన్నా వెంటనే చంపేసి పాతి పెట్టాలని ఆదేశించారు. ఈ వ్యాధికి వ్యాక్సిన్ లేదు. వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టాలంటే కోళ్లు, బాతులు,ఇతర పక్షులను సైతం చంపేయడమే మార్గమని అధికారులు చెబుతున్నారు.చంపేసిన వాటిని ఒక్కో గోతిలో 1800 కోళ్ల వంతున పాతిపెట్టాలని ఆదేశించారు. కోళ్లతో పాటు ఇతర పక్షి జాతి కూడా అంతమవుతున్నాయి.

మార్కెట్ ధమాల్..

జిల్లాలో సుమారు 250 కోళ్ల ఫారాలలో 2 కోట్ల 60 లక్షల కోళ్లు ఉన్నాయి.బర్డ్ ఫ్లూ ప్రభావంతో జిల్లాలో కోడిమాంసం, గుడ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. చికెన్, గుడ్డు తినడానికి ప్రజలు భయపడుతున్నారు.చాలా చోట్ల దుకాణాలు వెలవెల బోతున్నాయి. వ్యాపారానికి ఉడకబెట్టిన తర్వాత ఏ ప్రభావం ఉండదని చెబుతున్నప్పటికీ ప్రజలు మాత్రం తినడం మానేశారు.





కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా.. అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్

6

ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ

ఏలూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వస్తున్న ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు. (పక్కన ఇన్‌సెట్‌లో కేంద్రమంత్రి వర్మ, రాష్ట్ర మంత్రులు దుర్గేష్, సుభాష్, రామానాయుడు తదితరులు)

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి చివరి రోజు భారీగా నామినేషన్ల దాఖలు

6

- మొత్తం 59 మంది అభ్యర్థులు.. 72 సెట్ల నామినేషన్లు
- ముగిసిన స్వీకరణ గడువు
- నేడు పరిశీలన..13 వరకు ఉపసంహరణ

ఓపీకి వస్తే..బీపీ!

- ఓపిక ఉంటేనే జిల్లా ఆసుపత్రికి రావాలి
- అనారోగ్యంతో ఒక్కరే వచ్చారా అంతే
- రోగుల అష్టకష్టాలు.. నిర్లక్ష్యంగా సిబ్బంది



జిల్లా ఆసుపత్రిలో ఓపీకి భారీ క్యూ

రోగులకు తప్పని తిప్పలు..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీజీహెచ్) .. అదేనండి పెద్దాసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారా ? అయితే ఆసుపత్రికి తప్పనిసరిగా ఇద్దరు రావాల్సి ఉంటుంది. వైద్యం కోసం వచ్చే వ్యక్తితో పాటు మరొకరు తోడు ఉండాలి. వెంట సెల్‌ఫోన్ తెచ్చుకోవడం మరిచిపోవద్దు. ఎందుకంటే ఓపీ చీటీ రాయించుకున్న తర్వాత డాక్టర్ రాసిన చీటీ ... [illegible] ... మాయానికి డాక్టర్ గారు ఉంటే ఉండొచ్చు లేకపోతే లేదు.

సోమవారం జీజీహెచ్‌కు వైద్యసేవల కోసం పెద్ద సంఖ్యలో వచ్చారు. సోమవారం ఓపీ రష్‌గా ఉంటుందని భారీగా రోగులు వస్తారని తెలిసినా ఆసుపత్రి అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయకపోవడంతో రోగులు, వారి సహాయకులు తిప్పలు తప్పలేదు.మహిళా విభాగంలో కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే రిజిస్ట్రేషన్లు చేసేందుకు నియమించారు. నర్సర్ పనిచేయడంలేదని కొంతసేపు, డైరెక్ట్‌గా వెళ్లి ఓపీ చీటీలు తీసుకోవాలని మరికొంతసేపు రోగులను, వారి సహాయకులను గందరగోళానికి గురి చేశారు. కొంతసేపటి తర్వాత రిజిస్ట్రేషన్లు అవడంలేదని వీళ్లు చేతులెత్తేశారు. మహిళలంతా మళ్లీ ఈసారిమొత్తం కంప్యూటర్ విభాగం వద్దకు పరుగులు పెట్టారు. ... [illegible] ... వైద్యసేవలు అందించడంలో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది.

భోజనం ఎలా ఉంటుంది?

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీఈవో



తాళ్లపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల చదివికే మంచి బోధనతో పాటు భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో మిడ్‌డే మీల్స్‌ను సోమవారం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజూ భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 24,763, 10,553 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవు తారన్నారు. 404 పాఠశాలల నుంచి 134 సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నులి పురుగులను చంపేద్దాం!

అల్బెండజోల్ మాత్రలు వేసిన కలెక్టర్



తాళ్లపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆరు నెలలకొకసారి నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం పురస్కరించుకుని వేగేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో అల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమం 94.8 శాతం మేర పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 17వ తేదీన అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.


స్వామివారి ఆలయంలో పండిత సదస్యం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

వైభవంగా పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పండిత సదస్యం వైభవంగా జరిగింది. ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై అలంకరించి సదస్యం నిర్వహించారు. ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకస్వాముల సారథ్యంలో ప్రత్యేక మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లకు వేదాశీర్వచనం ఇచ్చారు. కల్యాణం, రథోత్సవం ముగిసిన తర్వాత స్వామి, అమ్మవార్లు ఆశీర్వచనం పొందే ఈ ఘట్టం భక్తులను పులకింపజేసింది. సాయంత్రం 6.30 గంటలకు స్వామివారికి ధూప సేవ జరి పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహుదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, దాసరి వాసు, అయినపర్తి ఏసు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, వలవల రాంబాబు, దత్తుడు, పేరూరు వేద పండితులు పాల్గొన్నారు.


హనుమత్, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం



హనుమత్, సింహ వాహనాలపై అంతర్వేది నరసన్న

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి వెంకటసత్యనారాయణరాజు వారిచే నిర్మితమైన హనుమద్వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. తొలుత వాహనశాల వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహన నిర్మాతలు, అధికారులు, అర్చకులు, భక్తులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి లక్ష్మణరావుచే నిర్మితమైన సింహ వాహనంపై పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి హారతులు ఇచ్చారు. ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహుదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, అయినపర్తి ఏసు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, వలవల రాంబాబు, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

నేడు రాజాధిరాజ, అశ్వవాహనాలపై గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు రాజాధిరాజ వాహనంపై ఊరేగుతారు. సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ జరుగుతుంది. రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు.

చక్రస్నానానికి ఏర్పాట్లు

బుధవారం ఉదయం 8 గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం చక్రస్నానానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలకు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో బారికేడ్లు నిర్మించి భక్తులంతా కార్యక్రమాన్ని తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


సైకిల్ యాత్ర చేస్తున్న ముత్తు సెల్వన్

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తున్నట్టు తమిళనాడు కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వన్ తెలిపారు. యాత్రలో భాగంగా సోమవారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1,111 రోజుల పాటు ఐదు దేశాల్లో 34,300 కిల్లో మీటర్ల మేరకు సైకిల్ యాత్ర చేస్తున్నానన్నారు. 2021 డిసెంబరు 21న ప్రారంభించిన యాత్ర నేపాల్, బంగ్లాదేశ్, వియత్నాం, థాయ్‌లాండ్, బ్యాంకాక్, మయన్మార్‌ల్లో సాగిందన్నారు. ఇప్పటిదాకా 29వేల కిలోమీటర్లు పూర్తి చేశానని, ఢిల్లీలో ఇండియా గేటు వద్ద ముగిస్తానన్నారు.

కర్ర పెండలం క్రషింగ్

కాకినాడ జిల్లాలో పది మిల్లుల్లో ప్రారంభం... పుట్టికి రూ.1,200 గిట్టుబాటు కాదంటున్న రైతులు


క్రషింగ్‌కు సిద్ధంగా ఉన్న కర్ర పెండలం దుంపలు

సామర్లకోట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పది సగ్గుబియ్యం మిల్లుల్లో క్రషింగ్ సీజన్ ప్రారంభమైంది. ఆంధ్రా శాగో మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నిర్దేశించిన ప్రకారం జనవరి నెలాఖరు నుంచే దుంప క్రషింగ్ సీజన్ ప్రారంభించాలని అనుకున్నప్పటికీ మిల్లుల్లో కొన్ని సాంకేతిక అవరోధాలను సరిదిద్దడంలో కొంతమేర జాప్యం జరిగినట్టు సమాచారం. ఈ కారణంగానే ఫిబ్రవరి మొదటి వారంలో మూడవ తేదీన మిల్లుల్లో క్రషింగ్ ప్రారంభించినట్టు మిల్లర్లు చెప్పారు. కర్రపెండలం దుంప ఆధారంగా సగ్గుబియ్యం తయారుచేసే మిల్లులు రాష్ట్రంలో కేవలం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే అందునా సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతాలు, ఏజెన్సీ మండలాల్లో సాగవుతున్న కర్ర పెండలం దుంప మొత్తం సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోని సగ్గుబియ్యం మిల్లులకే సరఫరా అవుతుంటాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 28 సగ్గుబియ్యం మిల్లులు ఉన్నప్పటికీ ఈ ఏడాది సుమారు 10 మిల్లులలోనే దుంప క్రషింగ్ జరిపేందుకు సన్నాహాలు చేశామని ఆంధ్రా శాగో మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. రైతుల నుంచి గత ఏడాది కర్ర పెండలం దుంప పుట్టికి (225 కిలోలు) రూ. 1,600 చెల్లించగా ప్రస్తుత ఏడాది పుట్టికి రూ.1,200 మాత్రమే చెల్లించేందుకు నిర్ణయించడంతో ధర గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు. అయినా గత్యంతరం లేని పరిస్థితిల్లో పక్వ దశకు చేరిన కర్ర పెండలం దుంపను సగ్గుబియ్యం మిల్లర్లు చెప్పిన ధరకే రైతులు సరఫరా చేస్తున్నారు. గత ఏడాది కొనుగోలు చేసిన ధరకన్నా పుట్టికి రూ.400 చొప్పున నష్టపోవాల్సి వస్తున్నట్టు రైతుల వాదనగా వినిపిస్తోంది. సగ్గుబియ్యం తయారీకి ఉత్పాదక వ్యయం పెరుగుతుండడం, సేలం మార్కెట్‌లో సగ్గుబియ్యం బస్తాకు (60కిలోలు) రూ.3,600కు మించకపోవడంతో దుంపకు అంతకుమించి ధర చెల్లించలేపోతున్నట్టు మిల్లర్లు చెప్తున్నారు. ఈ ఏడాది కర్ర పెండలం దుంప సాగుకు సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన భూమిలో దుంప ఎదుగుదల లోపించడం ఒక కారణం. అధిక శాతం మెట్ట రైతులు పామాయిల్ పంట సాగుకు మొగ్గుచూపుతుండడం మరో కారణంగా. దీంతో కర్ర పెండలం దుంప సాగు విస్తీర్ణం రానానూ తగ్గుతోందని పలువురు దుంప రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కేవలం 10వేల ఎకరాలలోపు మాత్రమే దుంప సాగు జరిగినట్టు మిల్లర్ల సమాచారం. రైతులకు ప్రైవేట్ అప్పులుగా పంట పెట్టుబడులు మిల్లర్లు మాత్రమే ఇస్తున్నందున వ్యవసాయ, ఉద్యానవన శాఖల సర్వే కన్నా మిన్నగా దుంప సాగు విస్తీర్ణం సర్వే సమాచారం మిల్లర్లకే ఎక్కువగా తెలుస్తుంది. కాగా దిగుబడి ఎకరాకు 25 పుట్లు అందే అవకాశాలు ఉన్నాయని దుంప రైతు బండే కొండలరావు ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనందున దుంప రైతులు నష్టపోయే ప్రమాదమే గాక భవిష్యత్తులో దుంప సాగు ఉనికి కనుమరుగయ్యే అవకాశాలున్నాయని కొండలరావు వాపోయాడు. రాష్ట్రంలోనే ఏకైక దుంప పరిశోధనా కేంద్రం పెద్దాపురంలో ఉన్నప్పటికీ పండించిన దుంపకు గిట్టుబాటు ధర కల్పించడంలోను, సగ్గుబియ్యం మిల్లర్లు ఉత్పత్తి చేసిన సగ్గుబియ్యానికి సేలం మార్కెట్లో గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

తాటిపర్తిలో ముగిసిన

ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

● ఉత్తమ నాటికగా మూల్యం


తాటిపర్తిలో చివరిరోజు ప్రదర్శించిన గురితప్పిన వేట నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సమాజానికి సందేశాన్ని ఇస్తూ, ప్రజలను ఆలోచింపజేసే విధంగా నాటికల పోటీల ప్రదర్శనలు సాగాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 5రోజులు పాటు జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు సోమవారం తెల్లవారు జామున ముగిశాయి. చివరిరోజున గుంటూరు జిల్లా పొన్నూరు రసఝరి కళాకారులు ప్రదర్శించిన గురి తప్పిన వేట అందరిని ఆకట్టుకుంది. మూలకథను మోదుగ సుధ అందించగా, వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.

విజేతలు వీరే...

ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన మూల్యం నాటిక ఎంపిక కాగా ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా జనరల్ బోగీలు(కొలకలూరి సాయి ఆర్ట్స్)నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత(విశాఖపట్టణం తెలుగు కళాసమితి) ఎంపిక కాగా, ఉత్తమ రచనగా సింహప్రసాద్(మూల్యం), ఉత్తమ నటుడిగా పీపీ వరప్రసాద్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ నటిగా జ్యోతి రాజ్(మూల్యం), ఉత్తమ ప్రతినాయకుడిగా ఎస్.వెంకటేశ్వరరావు (విముక్తి), ఉత్తమ హాస్య నటుడిగా కన్నబాబు(నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ సహాయ నటుడిగా కావూరి సత్యనారాయణ(చిగురు మేఘం), ఉత్తమ ద్వితీయ నటిగా సురభి ప్రభావతి(జనరల్ బోగీలు), ఉత్తమ రంగాలంకరణ దివాకర్ ప్రభాకర్(మూల్యం), ఉత్తమ ఆహార్యంగా నాగు(చిగురుమేఘం), జ్యూరీ బహుమతుల్లో కె.నాగేశ్వరరావు(జనరల్ బోగీలు), బి.శివశంకరశాస్త్రి(మూల్యం), సమాజానికి సందేశం ఇచ్చే నాటక రచయితగా పీటీ మార్గవ్(జనరల్ బోగీలు) ఎంపికయ్యారు. విజేతలకు మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, ఇతర ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అపర్ణాదేవి ఆలయ ప్రధాన అర్చకుడు ఆకొండి ప్రభాకర శాస్త్రి, న్యాయనిర్ణేత రాజాతాతయ్య పాల్గొన్నారు.

గొర్రిపూడిలో శూలాల సంబరం


నోటికి శూలాలు గుచ్చుకున్న భక్తులు

కరప, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడిలో పురాణ ప్రాశస్త్యం కలిగిన బసవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అలుగుల(శూలాల) సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కరికాల భక్తులు గత 7 దశాబ్దాలుగా ఈ సంబరాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం కరికాల భక్తులు తమ బుగ్గలకు శూలాల ను గుచ్చుకుని ట్రాక్టర్ల మీద గ్రామంలో ఊరేగారు. అంతకుముందు బసవవేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని సమీప కాలువలో స్నానం చేయించి పంచామృతాలతో అభిషేకించారు. బంకమట్టితో నంది ప్రతిమను రూపొందించి పూజలనంతరం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు.

ముగిసిన పొన్నాడ బంగారుపాప ఉత్సవాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో ఈనెల 7న ప్రారంభమైన బషీర్‌బీబీ ఔలియా 70(బంగారుపాప)వ ఉరుస్ ఉత్సవాలు ఆది వారం అర్ధరాత్రి ముగిశాయి. ఆదివారం సాయంత్రం మూలపేట నుంచి బంగారు పాప ఆలయానికి ముజావర్లు గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. గంధం బంగారుపాప ఆలయానికి చేరుకున్న అనంతరం అక్కడ ముజావర్లు పాతెహకానీ అనగానే గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. బంగారుపాప దర్శనానికి అనేక ప్రాంతాల నుంచి నుంచి విచ్చేసిన హిందూ, ముస్లిం భక్తులు గంధం కోసం పోటీపడడం విశేషం. బంగారుపాప ఉరుస్ ఉత్సవాల్లో పాల్గొని బంగారుపాప గంధాన్ని పూసుకుంటే తలచిన పనులన్నీ జరుగుతాయని భక్తుల నమ్మకం.


బంగారుపాప దర్గాకు గంధాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న ముజావర్లు

చివరి రోజు పోటెత్తిన

నామినేషన్లు

- 29 మంది 48 సెట్ల నామినేషన్ల దాఖలు
- మొత్తం 59 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్లు
- పూర్తయిన నామినేషన్ల స్వీకరణ.. నేడు పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకు గడువు

ఏలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు చివరి రోజు సోమవారం దరఖాస్తులు పోటెత్తాయి. చివర రోజు ఒక్కరోజే పెద్ద ఎత్తున అభ్యర్థులు ముహుర్తాలు చూసుకుని రావడంతో ఏలూరు జిల్లా కలెక్టరేట్ కిటకిటలాడింది. సోమవారం 29 మంది 48 సెట్ల నామినేషన్ల వేశారు. దీంతో మొత్తం మీద 59 మంది 72 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నెల 11న నామినేషన్ పరిశీలన చేస్తారు. 13న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఇదేరోజు సాయంత్రం బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. తర్వాత గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయి. 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరగనుంది.

చివరి రోజు నామినేషన్లు ఇలా..

పేరాబత్తుల రాజశేఖరం (కోనసీమ, కూటమి అభ్యర్థి), ఎం.శాస్త్రులు(రావులపాలెం), ఎం.శ్రావణి (రావులపాలెం), ఎస్.రామకృష్ణ (అత్తిలి) ఈయన తరపున బెంజిమెన్‌రాజు నామినేషన్ వేశారు. కె.జీవ దేవాదయాకర్ (చింతలపూడి), ఏళ్ల దొర బాబు (అమలాపురం), భావన ధాన్యలక్ష్మి (తాడేపల్లిగూడెం), ములకల శ్రీనివాస్ (ఏలూరు, నాలో సెట్), దిడ్ల రాఘవరావు (కోనసీమ), బి.శ్రీనివాస్ (చిం తలపూడి), బి.శ్రీరామమూర్తి(రాజమండ్రి), షేక్ హుస్సేన్(ఏలూరు), షేక్ అస్లాం(కాకినాడ), ఆర్.ముఖేష్‌బాబు (దెందులూరు), జేటీ రామారావు (రాజమండ్రి), పి.లీలా గణేష్(ఏలూరు), ఎం.అంబేడ్కర్(రామచంద్రపురం), కె.లావణ్య (నరసాపురం), కె.నాగేశ్వరరావు (రాజమండ్రి), కృష్ణ మోహన్ (కాకినాడ), పి.సుప్రజా (నర్సా పురం), కె.గౌతమ్‌బాబు (అమలాపురం), వీవీ సత్యనారాయణ (జగ్గన్నపేట), పేరాబత్తుల సత్యవాణి (కాకినాడ), వి.శ్రీనివాసరావు (పిఠాపురం), నాగభూషణ పద్మ, దాఖలు చేశారు.

అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్

కాకినాడ నుంచి అధిక సంఖ్యలో బయలుదేరిన కార్లు

ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ


పేరాబత్తుల నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఏలూరు,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వికి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం కాకినాడ టీడీపీ కార్యాలయం నుంచి కూటమి శ్రేణులు భారీ ర్యాలీగా బయలుదేరారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అశేషంగా తరలివచ్చిన మంత్రులు, కూటమి నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఏలూరు జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పేరాబత్తుల, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక మీరైతే పరిష్కరించే మనిషిగా నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కూటమి బలపర్చిన పేరాబత్తులను గెలిపిస్తాయన్నారు. కేంద్ర ఉక్కు కర్మాగారాలశాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రులు కందుల దుర్గేష్, గొట్టి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్షులు కేఎస్.జవహర్, ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, దాట్ల బుచ్చిబాబు, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, జ్యోతుల నెహ్రూ, ముప్పిడి వెంకటేశ్వరరావు, బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, వత్సవాయి ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, పులపర్తి రామాంజనేయులు, మిరియాల శిరీష, సుబ్బరాజు, ఎమ్మెల్సీలు ఎంఏ.షరీఫ్, వేపాడ చిరంజీవి, దువ్వారపు రామారావు, మాజీ మంత్రులు పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఏపీఐడీసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దివ్య అధ్యయన మహోత్సవాలు


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

కోరుకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య అధ్యయన మహోత్సవాలు(తిరునాళ్ళు)వైభవంగా సాగుతున్నాయి. ఏటా స్వామి వారి కల్యాణ మహోత్సవాలకు నెల రోజులు ముందు ఈ దివ్య తిరునాళ్లు జరుగుతాయి. దీనిలో భాగంగా లక్ష్మీనరసింహస్వామి వారు రోజుకొక్క వాహనంపైన గ్రామోత్సవం చేస్తారు. మంగళవారం రాత్రి అశ్వ వాహనంపై గ్రామోత్సవం, బుధవారం రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. కల్యాణోత్సవాల్లో లక్ష్మీనరసింహస్వామి వారు 5రోజులు పాటు 5వాహనాల్లో గ్రామోత్సవం చేస్తుండగా అధ్యయనోత్సవాల్లో మాత్రం 5రోజులుపాటు అనంత పద్మనాభ స్వామి వివిధ వాహనాల్లో గ్రామోత్సవం చేస్తారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న కొండపై బేడా ఉత్సవం, శ్రీ నమ్మాళ్వార్ల పరమ పద ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం భీష్మ ఏకాదశి నాటి రాత్రి కొండపైకి తీసుకువెళ్లిన స్వామి వారి ఉత్సవ మూర్తులను గురువారం ఉదయం కిందికి తీసుకువస్తారు.

13 నుంచి రంగనాథ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు

లక్ష్మీనరసింహస్వామి అధ్యయనోత్సవాలు ముగిసిన తరువాత ఈనెల 13, 14 తేదీల్లో శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సమయంలో ఉదయం, సాయంత్రం సేవా కాలం, రాత్రికి బేడా ఉత్సవం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు.

15 నుంచి పద్మనాభస్వామి ఆలయంలో..

శ్రీ రంగనాథ స్వామి అధ్యయనోత్సవాలు అనంతరం ఈ నెల 15, 16 తేదీల్లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన క్షేత్ర పాలకులైన శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామి వారికి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం సేవాకాలం, తీర్థప్రసాదగోష్ఠి, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయని దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పరాసర రంగరాజ భట్టర్ స్వామి తెలిపారు. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు దేవస్థానం ఈవో పర్యవేక్షణలో అర్చక స్వాములు, వేదాంత పండితులు నిర్వహిస్తున్నారు.

'ఏటీఎమ్ మోడల్ సాగుతో నిరంతర ఆదాయం'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 20సెంట్ల పొలంలో పలు రకాల పంటలను ఏటీఎం మోడల్‌లో సాగు చేయడం ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం కాకి నాడ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎలియాజర్ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో రైతు ఆకుల వీరభద్రరావు పొలంలో ఏటీఎం మోడల్ సాగు, ఘనజీవామృతం, బయోచార్ తయారీలను రాష్ట్రంలోని 26 జిల్లాల ఎన్‌పీఎం పాపుల ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం స్టేట్ కన్సల్టెంట్లు జానకి, బుజ్జిబాబు, రిసోర్స్‌పర్సన్లు శివచక్రం, గోపాలకృష్ణ, భీమరాజు పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుడి సదస్యం


భీమేశ్వరుడి సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు

● సమస్త వాహనాలపై స్వామి గ్రామోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారంరాత్రి భీమేశ్వరస్వామివారి సదస్యం ఘనంగా జరిగింది. కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామిలను వేదికపై అదిష్టింపచేశారు. ఆలయ అర్చకస్వాములు ముందుగా స్వామి,అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూచారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహం, ముక్కోటి దేవతా ఆవాహం చేశారు. అనంతరం వేదస్వస్తి, స్వస్తి ప్రవచనం జరిపారు. తదనంతరం ఆగమ పండితులు, వేదపండితులు, స్వస్తి వాచకులు, అర్చకస్వాములు, పురోహితులను నూతన వస్త్రాలతో ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవాని సత్కరించారు. నీరాజన మంత్రపుష్ప కార్యక్రమంతో సదస్యం పూర్తయ్యింది. వడపప్పు, పానకం భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం సమస్త వాహనములపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, పురోహితులు ఆలయసిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


వేదపండితులను సత్కరిస్తున్న ఈవో

గోడకు కన్నం...బంగారం మాయం

● ఏలేశ్వరంలో రూ.38.25లక్షల బంగారు, వెండి ఆభరణాలు అపహరణ ● ఆధారాల సేకరణలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్

ఏలేశ్వరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం బాలాజీచౌక్ సెంటర్‌లో శ్రీసిద్ధినాథ్ జ్యూయలర్స్ బంగారం దుకాణంలో రూ.38.25లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం దుకాణ యజమాని మహారాష్ట్రానికి చెందిన శివాజీ సుమారు 25 సంవత్సరాల క్రితం ఏలేశ్వరం వచ్చి బంగారం వ్యాపారాన్ని మార్కెట్‌లో కొనసాగించేవారు ఇటీవల నూతనంగా తమ వ్యాపారాన్ని మెయిన్‌రోడ్డుకు మార్చారు. సోమవారం ఉదయం పదిగంటలకు శివాజీ ఇంటి నుంచి వచ్చి దుకాణం తెరచి లోపలకి వెళ్లి చూసేసరికి దుకాణం వెనుక భాగం గోడను డ్రిల్లింగ్ మిషన్ సహాయంతో రంధ్రంగా చేసి లోపలకు దుండగులు ప్రవేశించారని దుకాణ యజమాని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ శ్రీహరిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని సీఐ నుంచి వివరాలు సేకరించి జిల్లా కేంద్రం కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించే పనిలోపడ్డారు. నగల దుకాణం నుంచి బయలుదేరిన జాగిరం దుకాణాలవద్దకు తిరిగి వచ్చింది. దుండగులు గోడ పగులగొట్టి లోపలకు వచ్చి సీసీ కెమెరాల డీవీఆర్‌ను చాకచక్యంగా తొలగించి లోపల రెండు నగదు లాకర్లు ఉండగా వీటిలో ఒక లాకరును పగులగొట్టి వాటిలో ఉన్న 50గ్రాములు బంగారు ఆభరణాలు, 32 కేజీల వెండి వస్తువులను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.38.25లక్షలు ఉంటుందని భావిస్తున్నామన్నారు. ఈ దొంగతనంపై అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేసి దుండగులు ఎంతమంది అనేది దర్యాప్తులో వెల్లడవుతాయన్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, పోలీసు అధికారులు ఉన్నారు.




దుకాణంలో గోడకు రంధ్రంపెట్టి లోపలకు వచ్చి లాకర్లను పగులగొట్టిన దొంగలు, సంఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న సీఐ సూర్యఅప్పారావు, వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌గా వీవీ సుబ్బారావు బాధ్యతల స్వీకరణ


ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్సీహెచ్ఈ నేతృత్వంలో జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు కన్వీనర్‌గా నియమితులైన మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, సెట్ ఛైర్మన్ ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ సమక్షంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీసెట్)ను ఎటువంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు తగినచర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేస్తామని అదేవిధంగా కోకన్వీనర్లు, కోఆర్డినేటర్లను నియమిస్తామన్నారు. ఈసందర్భంగా తనను కన్వీనర్‌గా నియమించినందుకు సీఎం నారాచంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఏపీ ఎస్సీహెచ్ఈ ఛైర్మన్ కె.మధుమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాద్, డైరెక్టర్లు వి.రవీంద్ర, సీహెచ్ సాయిబాబు, బి.బాలకృష్ణ, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, ఎం.రామలింగరాజు, పద్మరాజు, విభాగాధిపతులు వెంకటరెడ్డి, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు

అనపర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బిల్డింగ్ సెంటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి సెంటరింగ్ మెటీరియల్ తెచ్చి వ్యాన్ నుంచి దింపే క్రమంలో అదే వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన సోమవారం అనపర్తిలో చోటుచేసుకుంది. అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండపేటకు చెందిన కొమ్మిశెట్టి సత్తిబాబు (29) బిల్డింగ్‌లకు సెంటరింగ్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనపర్తిలోని రిజిష్టార్ ఆఫీసు సమీపంలో సెంటరింగ్ పనులు ఒప్పుకున్న సత్తిబాబు సోమవారం సెంటరింగ్‌కు సంబంధించిన సామగ్రిని టాటా ఇంట్రా వ్యాన్‌లో తీసుకుని వచ్చాడు. సామాన్లను దింపే క్రమంలో వ్యాన్ వెనుక భాగంలో నిలుచున్న సత్తిబాబు అనుకోకుండా వ్యాన్‌ను డ్రైవర్ వెనుకకు నడపడంతో సత్తిబాబును ఢీకొంది. దీంతో అక్కడే ఉన్న కర్రలపై పడటంతో సత్తిబాబు చెంపకు కర్ర బలంగా తగలడంతో అక్కడికక్కడే కూలబడ్డాడు. స్థానికులు సత్తిబాబును అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య నాగదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి


మృతి చెందిన పండ్ల వ్యాపారి నరెడ్ల సత్తిబాబు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం మేరకు ప్రత్తిపాడు తోటవీధికి చెందిన నరెడ్ల సత్తిబాబు(62)స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం పొందుతున్నాడు. సోమవారం రాచపల్లి అడ్డరోడ్డులోని హోటల్ నుంచి భోజనం పొట్లాలను మోటార్ బైక్‌పై తీసుకువస్తుండగా మినర్వా విద్యాసంస్థల ఎదుట తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్లే వాహనం ఢీ కొంది. దీంతో సత్తిబాబు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సత్తిబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదంలో సత్తి బాబు మృతి చెందడంతో స్థానిక తోటవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వానికి తరలించి ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్ రైలు ఢీ కొని వృద్ధుడి మృతి

తుని రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. తునినుంచి అన్నవరం వైపు వెళ్తున్న గూడ్స్ రైలుని గమనించకుండా పట్టాలు దాటుతుండడంతో రైలు ఢీకొని వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని వయస్సు 55, అతనివద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో, ఆర్ఐకు తీవ్రగాయాలు


వీఆర్వోకు చికిత్స చేస్తున్న వైద్యులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కొత్తపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్వో, ఆర్ఐలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. రోజువారీ విధుల్లో భాగంగా కార్యాయానికి వెళుతున్న కొత్తపల్లి ఆర్ఐ మధుసూధనరావు, వాకతిప్ప వీఆర్వో చంద్రశేఖర్ మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్నారు. కొత్తపల్లి మీసేవ సమీపించే సరికి వెనుక నుంచి వేగంగా బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఆర్ఐ, వీఆర్వోను ఢీకొట్టారు. దీంతో వీరిద్దరు రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వీఆర్వోకు తలకు, చెవికి గాయాలవ్వగా స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ఆర్ఐ తలకు బలమైన గాయం తగలడంతో అత్యవసర చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో ఐదుగురికి అస్వస్థత

కొత్తపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేసుకుంటున్న రైతులపై తేనెటీగలు దాడి చేయడంతో ఐదుగురు రైతులు అస్వస్థతకు గురైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లిలో జరిగింది. సోమవారం కొత్తపల్లిలో ఐదుగురు రైతులు దాళ్వా వరి చేలో కలుపు తీస్తున్నారు. కలుపు తీసేచోట గట్టుకుఉన్న చెట్టుకొమ్మపై తేనెతుట్ట ఉండడాన్ని గమనించకపోవడం, వాళ్ళు కలుపు తీసేందుకు తుట్ట పక్క నుంచి చేలో దిగి పనిచేయడంతో తుట్ట కదలి ఈగలు రైతులపై ముప్పేట దాడి చేశాయి. రైతులు వరి చేలల్లో నుంచి పరుగెత్తుకొంటూ గట్టుకు చేరారు. రైతులు వెంటనే చికిత్స కోసం పీహెచ్‌సీకి తరలించారు.

హాకీ టోర్నమెంట్ నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు

● కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా


హాకీ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆల్ ఇండి యా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల టోర్నమెంట్‌ను కాకి నాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్ వేదికగా నిర్వహించేందుకు సన్నాహక ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నా యని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడాపోటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తుండగా, కాకినాడజిల్లా యంత్రాంగం ఇందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రీజనల్ స్పోర్ట్స్ బోర్డుల నుంచి పురుషుల, మహిళల టీమ్‌లు ఈపోటీలలో పాల్గొంటున్నాయన్నారు. దీనికి సంబంధించి ఈనెల 6వ తేదీ వరకు ఎంట్రీలు స్వీకరించగా, 26 పురుషలజట్లు, 7 మహిళలజట్లు ఎంట్రీలు పంపాయన్నారు. ఒక్కొక్క జట్టులో 18 మంది క్రీడాకారులు, ఒక కోచ్, ఒక మేనేజర్‌లతో మొత్తం 20మంది సభ్యులు ఈపోటీలకు హాజరుకానున్నారు. లాజి స్టిక్స్ ట్రాన్స్‌పోర్ట్, రిసెప్షన్, రిజిస్ట్రేషన్, ఫుడ్, బస, వైద్యం, పారిశుధ్యం తదితర అంశాల పర్యవేక్షణకు జిల్లా అధికారుల కూర్పుతో 14 ఉపకమిటీలను ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేశారు. టోర్నమెంట్‌లో జరిగే రోజువారీ పోటీలు, టీమ్‌ల వివరాలు, విజేతల సమాచారాన్ని టెక్నికల్ కమిటీ, ప్రెస్అండ్ మీడియా కమిటీలు అందిస్తాయన్నారు. ప్రేక్షకుల గ్యాలరీలు, క్రీడాకారుల చేంజింగ్ రూమ్‌లు, లైటింగ్, సౌండ్, తాగునీరు, మరుగుదొడ్లు, టీమ్‌లకు బస, రవాణా, ఆహారం ఏర్పాట్లతో ఆల్ ఇండియా సివిల్ సర్వీ సెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు రంగం సిద్ధం అవుతోందన్నారు.

తునిలో బాలుడి కిడ్నాప్ కలకలం

● పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు బాలుడు


తల్లి వద్దకు చేరిన బాలుడు

తుని రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో బాలుడు కిడ్నాప్ కలకలం రేగింది. తుని పట్నంలో భాష్యం విద్యాసంస్థల్లో ఒకటో తరగతి చదువుతున్న పరమేష్ అదృశ్యం అవడం సర్వత్రాచర్చనీయాంశమైంది. ఉదయాన్నే స్కూల్‌కి వెళ్ళిన బాలుడిని గుర్తు తెలియని వ్యక్తులు బాబుకి ఐ డ్రాప్స్ వేయాలని ఒకసారి పంపించాలంటూ స్కూల్ సిబ్బందిని కోరగా అదృశ్యమైన బాలుడు తాలూకా అని భావించిన స్కూల్ సిబ్బంది బాలుడిని బయటకు పంపించినట్లు స్కూల్ సిబ్బంది చెబుతున్నారు. బాలుడు వెళ్ళిన కొద్ది సమయానికే లంచ్ బాక్స్‌తో కుటుంబ సభ్యులు స్కూల్‌కు వెళ్ళి బాలుడి కోసం ఆరా తీయగా అదృశ్యమైన విషయం గమనించిన తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తూ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో రంగంలోకి దిగిన పోలీసులు బాలుడు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భాష్యం పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో అవాక్కైన పోలీసులు బాలుడిని తీసుకెళ్ళిన మార్గంలో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దర్యాప్తు ముమ్మరం చేశారు. కొద్ది సమయానికి బాలుడిని దుండగులు డి.పోలవరంలో ఆటో ఎక్కించి తుని పట్టణానికి పంపిస్తున్నామని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో సీఎంఆర్ సెంటర్లో బాబు రాకకోసం ఎదురు చూశారు. దుండగులు చెప్పిన విధంగానే కొద్ది సమయానికి బాబు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పచెప్పిన తుని పట్టణ పోలీసులు కిడ్నాప్ వెనుక ఎవరు ఉన్నారు, ఎందుకు చేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు, రేపు మన్యం బంద్

రంపచోడవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాలలో అమలులో ఉన్న ఆదివాసీ అనుకూల చట్టాల సవరణ యోచనకు వ్యతిరేకంగా మంగళ, బుధవారాల్లో ఆదివాసీ సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బంద్‌పై పోలీసులు ఆంక్షలు విధించారు. ఆదివాసీ చట్టాల సవరణ అంశంలో ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు దుమారంగా మారడంతో ఆదివాసీ సంఘాలన్నీ ఆందోళనలు సాగిస్తూ చివరకు రెండు రోజుల రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. వీరి ఆందోళనలు, బంద్‌లపై పోలీసు అధికారులు పలు ఆంక్షలు విధించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి అనుమతులూ లేని ఆందోళనలపై చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఆయా సంఘాల నాయకులకు ఎక్కడికక్కడా ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో నోటీసులను జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను ఆపడం, రవాణాలను స్తంభింపచేయడం, కార్యాలయాలను, వ్యాపార సంస్థలను మూసి వేయించడం వంటివి నేరాల కిందకు వస్తాయని పోలీసులు హెచ్చరించారు.

ఎస్ఐ మూర్తి కుటుంబానికి పోలీసుల అండ

● భారీ ఆర్థిక సాయం ● రూ.46.78లక్షలు అందజేత


మరణించిన ఎస్ఐ మూర్తి కుటుంబానికి ఆర్థికసాయం, చెక్కును అందజేస్తున్న పోలీసు మిత్రులు

కె.గంగవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామానికి చెందిన ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎన్ మూర్తి) ఇటీవల తణుకు పోలీస్టేషన్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వారి కుటుంబానికి తాము అండగా ఉంటామని పోలీసు మిత్రులు ముందుకువచ్చారు. సోమవారం కె.గంగవరంలో మూర్తికి నివాళి అర్పించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మూర్తి మిత్రులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకుని ఎస్.ఐ. పోస్టుకు ఎంపికయ్యాడు. 2012 పోలీసు శిక్షణలో చాలా చురుకుగా ఉండేవాడు. ఎవరికైనా చిన్ని కష్టం వచ్చిందంటే చలించిపోయి ఆదుకునేందుకు ముందుండేవాడు. విధి వక్రీకరించింది. అకస్మాత్తుగా చనిపోయాడు. భార్య, ఇద్దరుపిల్లలు, తల్లిదండ్రులను ఆదుకోవాలని నిర్ణయించాము. ఇద్దరు పిల్లల చదువులు, వారి భవిష్యత్ కోసం రూ.46.78 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 2012 బ్యాచ్‌కు చెందిన 1156మంది రూ.30లక్షలు ఇద్దరు పిల్లలకు చెందే విధంగా ఫిక్సిడ్ డిపాజిట్‌గా వేశారు. ఇదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా ఎస్.పి.నయీంఆస్మీ రూ.4లక్షలు తల్లిదండ్రుల నిమిత్తం. పోలీసు స్క్వాడ్ వారు 27మంది 1.10లక్షలు, ఏలూరు జోన్ పోలీస్ అసోసియేషన్‌కు చెదిన 126 మంది 10.58లక్షలు భార్యాపిల్లలకు వెరసి రూ.46.78లక్షలు మూర్తి తల్లి దండ్రులు ఆదూర్తి గోపాలరావు, సూర్యావతి, భార్య విజయలక్ష్మి, పిల్లలు చందన, హెమాన్షిలకు అందజేశారు. వీటిలో రూ.20 లక్షలు చొప్పున ఇద్దరు పిల్లలకు ఫిక్సిడ్ డిపాజిట్‌గా వేశారు. రూ.4లక్షలు తల్లిదండ్రులకు, రూ.1.68 లక్షలు భార్యకు విభజించి అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.విశ్వనాద్, ఏలూరు రేంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజెష్, పామర్రు ఎస్.ఐ. ఎస్.కె. జానీబాషా, పోలీసుమిత్రులు శ్రీహరి, రమేష్, దుర్గారావు, శంకరు, విజయ్, వెంకటరమణ, గురవయ్య, వాసు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్వార్టర్ ఫైనల్స్

● రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు


క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి- విశాఖజిల్లా జట్లు

పిఠాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోగల బాస్కెట్‌బాల్ క్రీడామైదానంలో జరుగుతున్న మాజీ మంత్రి కొప్పన మోహనరావు, రమాదేవి స్మారక 8వ రాష్ట్రస్థాయి యూత్(అండర్ 17) బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 13 ఉమ్మడి జిల్లాలు నుంచి బాలబాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల మూడో రోజు సోమవారం రాత్రి బాలబాలికల విభాగంలో క్వార్టర్‌ఫైనల్స్ ఉత్కంఠభరితంగా సాగాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా జట్టుపై తూర్పుగోదావరిజిల్లా జట్టు విజయం సాధించగా, గుంటూరుపై అనంతపురం, చిత్తూరుపై కృష్ణా, కర్నూలుపై పశ్చిమగోదావరిజిల్లా జట్లు విజయం సాధించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలుర విభాగంలో విశాఖపై తూర్పుగోదావరి, గుంటూరుపై పశ్చిమగోదావరి, కర్నూలుపై చిత్తూరుజిల్లా జట్లు విజయం సాధించి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకున్నాయి. పోటీలను ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మాజీ సహాయ కార్యదర్శి బొజ్జా రామయ్య, ఇండియన్ ఉమెన్స్ టీమ్ కోచ్ శ్రీనాథ్, జాతీయ క్రీడాకారుడు మల్లీశ్వరరావు తదితరులు తిలకించి సూచనలు ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావులు పోటీల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో సుప్రీం ఆదేశాలు పాటించాలి: పీడీజే


సమావేశం నిర్వహిస్తున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ ప్రమాద కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఛైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కమిటీలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. అనంతరం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల రెవెన్యూ, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నష్టపరిహారం పెంచాలి

● ప్రజాప్రతినిధుల డిమాండ్


ఏలూరులో సమావేశమైన జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):సముద్ర జలాల్లో ఆయిల్ కంపెనీలు కొనసాగిస్తున్న కార్యకలాపాల వల్ల జరుగుతున్న నష్టాలకు అందించే పరిహారం పెంచాలని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు కాకినాడ, కోనసీమ జిల్లాల ఎమ్మెల్యేలు, పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరులో వీరు సమావేశం నిర్వహించారు. నష్టపరిహారం పెంపుపై ఆయిల్ కంపెనీలకు హెచ్చరిక జారీచేశారు. నరసాపురం నుంచి తుని వరకు వేటకు వెళ్ళే మత్స్యకారులందరికీ నష్టపరిహారం అందించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రస్తుతం కేటాయిస్తున్న మొత్తాన్ని రెండు శాతం పెంచాలని సూచించారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ల ద్వారా ఆయిల్ కంపెనీలకు లేఖలు పంపించేలా చర్యలు తీసుకునేందుకు సమావేశంలో నిర్ణయించినట్లు ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ళ జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, వనమాడి కొండబాబు, పంతం నానాజీలు పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

● 119 మంది అరెస్ట్, ● రూ.9,87,000 నగదు , 112 కోళ్లు స్వాధీనం

తాళ్లరేవు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోరింగ పోలీసుస్టేషన్ పరిధి జి.వేమవరంలో కోడిపందాలపై ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాలతో ఎస్‌డీపీవో, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కోరింగి ఎస్ఐ పి.సత్యనారాయణ నేతృత్వంలో కోరింగ పోలీసులు ఆదివారం రాత్రి కోడిపందాలపై దాడిచేశారు. పోలీసుల వివరాల ప్రకారం జి.వేమవరం గ్రామం పెంకే రాంబాబు అలియాస్ చొల్లంగి రాంబాబు మామిడితోటల్లో కోడిపందాలను నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సిబ్బంది, కాకినాడరూరల్ సీఐ, పోలీసులుకోడిపందాలపై దాడిచేశారు. 119మంది జూదగాళ్లను పట్టుకుని వారివద్ద నుంచి రూ.9,87,000 నగదు ను, 112 పందెం కోళ్లను, 5కార్లు, 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదుచేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


జి.వేమవరంలో పందాల రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే వాసు

● రూ.12 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం నగరానికి చెందిన ఐదుగురు బాధితులకు మంజూరైన రూ. 12 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ఇప్పటి వరకు తన నియోజకవర్గంలో రూ. కోటి విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. నగరంలో ఇంకా రూ. 80 లక్షల విలువైన 48 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువుకు చేరిన దివ్యరథోత్సవ పాదయాత్ర

● ఘన స్వాగతం పలికిన ప్రముఖ ఆర్యవైశ్యుడు గ్రంధినానబ్బులు కుటుంబ సభ్యులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : లోకకల్యాణార్థం దాదాపు 200 మంది రామభక్తులు చేస్తున్న భద్రాద్రి సీతారామాలయ దివ్య రథోత్సవ పాదయాత్ర సోమవారం దివాన్‌చెరువుకు చేరుకుంది. ఈసందర్భంగా జైశ్రీరామ్ జై జై శ్రీరామ్ నామంతో పరిసర ప్రాంతం మార్మోగింది. మండల ఆర్యవైశ్య ప్రముఖుడు గ్రంధి నానబ్బులు కుటుంబ సభ్యులతో ప్రధాన కూడలి వద్ద భక్త బృందానికి ఘన స్వాగతం పలికారు. వాసుదేవ గురుస్వామి మాట్లాడుతూ కాకినాడ జిల్లా అచ్చంపేట నుంచి ఈనెల 8వ తేదీన ఈయాత్ర ప్రారంభించామన్నారు. తొమ్మిది రోజుల పాటు యాత్రసాగి 16వ తేదీన భద్రాచలం చేరుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో రాజానగరం మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు మండవెల్లి వెంకన్నబాబు, నాయకలు గ్రంధిరాజా, నాగబాబు, గణేష్, ముత్తారామకృష్ణ, కంకటాల మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


గురుస్వామితో కలిసి జైశ్రీరామ్ నినాదాలు చేస్తున్న గ్రంధి నానబ్బులు, తదితరులు

రాములోరి దర్శనానికి.. కాలినడకన

కాకినాడకు చెందిన అప్పారావు దంపతులు కాకినాడ నుంచి భద్రాచలం కాలినడకన వెళుతున్నారు. సుమారు 200 మంది బృందంలో వీళ్లు కూడా ఉన్నారు. తాము ఈ యాత్ర చేయడం ఐదో పర్యాయమని చెప్పారు. ఈ నెల 8న బయలుదేరామని 17న రాముల వారి దర్శనంతో యాత్ర ముగుస్తుందన్నారు. దారి మధ్యలో అల్పాహారం, భోజన ఏర్పాట్లు ఉంటాయని, హైందవ ధర్మం గురించి ప్రచారం చేస్తూ సాగుతామన్నారు. 2022లో తాను కాకినాడ నుంచి అయోధ్య వరకూ నడిచి వెళ్లానని, 60 రోజుల సమయం పట్టిందని అప్పారావు వివరించారు. సనాతన హిందూ ధర్మ ప్రచారంతోపాటు లోకంలో అందరూ క్షేమంగా ఉండాలనే తలంపుతో కాలినడక యాత్రలు చేస్తున్నామన్నారు. దారి పొడవునా 'జై శ్రీరామ్' అని నినదిస్తూ అడుగులు వేస్తున్నారు.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)


అప్పారావు దంపతులు

కుతుకులూరులో ఆలయ మండప ప్రారంభోత్సవం


ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త గిరిప్రకాష్‌రెడ్డిను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కుతుకులూరులోని కూటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ. 50 లక్షలతో నిర్మించిన మండపాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతుల చేతులమీదుగా ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పారిశ్రామికవేత్త ఆవుల శ్రీగిరి ప్రకాష్‌రెడ్డిను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు చింతల రామకృష్ణ, సర్పంచ్ గొల్లు హేమతులసి, కర్రి చిన్నారెడ్డి, డీసీ ఛైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, తమలంపూడి సూర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

సీతానగరం, ఫిబ్రవరి 10: వంగలపూడి ఇసుక ర్యాంపు రీచ్ -1 నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని జల్లా శాండ్ ట్రాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఏ. ప్రసాద్ పట్టుకొని సీజ్ చేశారు. దీనిపై ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ లారీని ఆపి తనిఖీ చేయగా, ఎటువంటి రికార్డులు లేవన్నారు. 20 టన్నుల వరకు ఇసుక ఉందన్నారు. లారీని స్వాధీనం చేసుకుని సీతానగరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు.

క్లీన్ రోడ్లకు అదనపు చర్యలు

• 59 మంది తాత్కాలిక కార్మికులను నియమించిన కమిషనర్ కేతన్‌గార్గ్ • రాజమహేంద్రవరంలో అదనపు షిఫ్ట్‌లతో విధులు



షిఫ్ట్‌లను పరిశీలిస్తున్న శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాసరావు , ఊడ్చుతున్న పారిశుధ్య కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రోడ్లపై చెత్తాచెదారాలు ఇష్టానుసారంగా వేస్తున్న పరిస్థితిని పూర్తిగా మార్చేందుకు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అదనపు షిఫ్టును ఏర్పాటు చేసి క్లీన్ రోడ్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పారిశుధ్య విభాగంలో 59 మంది తాత్కాలిక కార్మికులను నియమించారు. రాజమహేంద్రవరంలోని చాలాప్రాంతాల్లోని రహదారులపై కొంతమంది షాపుల నిర్వాహకులు, తోపుడు బండ్లువారు చెత్త పారబోసేస్తున్నారు. అలాగే కొన్ని చోట్ల రోడ్డు కార్నర్ పాయింట్ వద్ద చెత్త పడవేస్తున్నారు. వీటిని ఉదయం షిఫ్ట్ 5 నుంచి 10 గంటల మధ్య విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు. ఆ తర్వాత వేసిన చెత్తను మధ్యాహ్నం షిఫ్ట్‌లో 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించే వారు తొలగిస్తున్నారు. అటుగా రాత్రి షిఫ్ట్‌లో 10:30 నుంచి 4:30 గంటల వరకు పనిచేసేవారు నగరాన్ని శుభ్రంచేస్తారు. అయితే పగటి పూట ఉదయం 10 తర్వాత మధ్యాహ్నం 12 గంటల మధ్యలోనే అత్యధికంగా రోడ్లపైకి చెత్త చేరుతుందని కమిషనర్ కేతన్‌గార్గ్ గుర్తించారు. దీంతో కొత్తగా తీసుకున్న తాత్కాలిక పారిశుధ్య కార్మికులతో ఉదయం 10:30 నుంచి మధ్యా హ్నం 2:30 గంటల మధ్య ప్రత్యేకంగా షిఫ్టను ఏర్పాటుచేశారు. నగరంలో రద్దీగా ఉండే రహదారులు, తోపుడు బండ్లు, వ్యాపార దుకాణాలు అధికంగా చోట్ల ఈ అదనపు షిఫ్ట్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ అదనపు షిఫ్ట్ పనులు చేసే తాడితోట, ఇన్నీసుపేట, మెయిన్‌రోడ్డు, స్టేడియం రోడ్డు, తదితర ప్రాంతాలను పరిశీలించారు. నగరంలో పారిశుధ్యాన్ని నియంత్రించడానికి కమిషనర్ క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని ఆయన చెప్పారు.

'గైట్' ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్నగైట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజు, పీవో షేక్ మీరా

రాజానగరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో తమ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతిభ కనబర్చినట్లు గైట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి.ధనరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలోని వైఎస్ కళాశాల, నర్సాపురంలో ఈ నెల 3 నుంచి 9 వరకు నిర్వహించిన శిబిరంలో పాల్గొన్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరు కాగా, ఏయూ తరపున గైట్ ఫార్మసీ కళాశాల నుంచి జి.సాయి శశాంక్, పి.సుచిత్ర రాష్ట్ర సంస్కృతిక సంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహించారన్నారు. ఎన్ఎస్ఎస్ (హైదరాబాబు)రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో షేక్‌మీరా అభినందించారు.

'నెలరోజుల్లో అన్ని కమిటీలు'

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని కమిటీలను నియమిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్, డివిజన్, మండల, టౌన్ కమిటీల ఏర్పాటుపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో చర్చించామని చెప్పారు. సమావేశంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్‌లూథర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎం.శారద, వడయార్, పట్నాల శ్రీనివాస్, బిల్డర్ బాబి, బర్రే సుబ్రహ్మణ్యం, నల్ల వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సంజీవ్‌నగర్‌కి చెందిన ఓ బాలిక (17) ఈ నెల 8న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పారావు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థులను గెలిపించండి

● ప్రచారంలో ఓటర్లను అభ్యర్థించిన ఎమ్మెల్యేలు వాసు, రామకృష్ణారెడ్డి, బలరామకృష్ణ


45వ డివిజన్‌లో ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. సోమవారం నగరంలోని 45వ డివిజన్‌లో టీడీపీ పార్లమెంట్ కమిటి ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణతో కలిసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి చేసే సత్తా కూటమి ప్రభుత్వానికే ఉందన్నారు. అలాగే 12వ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ప్రచారం చేశారు. పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: కూటమి బలపర్చిన ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటు వేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం పందలపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా డిగ్రీ ఓటర్లను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈయన వెంట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు చింతల రామకృష్ణ, కూటమినేతలు పడాల రాము, పడాల సూర్యనారాయణరెడ్డి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, పడాల చినబుజ్జి, కర్రి శ్రీనివాసరావు, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి, అనుసూరి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

కోరుకొండ: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ మండలంలోని కూటమి నేతలు ముమ్మరప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డువెంకటరమణ చౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి, ఇతర కూటమి నేతలు పాల్గొంటున్నారు.


పందలపాకలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ


రాజానగరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

రాజానగరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పీహెచ్‌సీ పరిధిలోని 16,500 మంది పిల్లలకు విద్యార్థులకు సోమవారం అల్బెండోజల్ మాత్రలు (నులిపురుగుల నివారణ మా త్రలు) పంపిణీ చేసినట్టు వైద్యాధికారి రామభాస్కర్ తెలిపారు. ఎంపీహెచ్ఎస్ ఎన్‌వీవీ రమణ. ఏఎన్ఎం సుధ, ఎంఎల్‌హెచ్‌పీ సోనియా, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలో 11,914 మందికి ఆల్బెండోజల్ మాత్రలు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ తెలిపారు. 1నుంచి 19 ఏళ్లలోపు ఉన్న 12,471 మందికి ఈ మాత్రలు అందజేశామని చెప్పారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలో సోమవారం అల్బెండోజల్ మాత్రలు పంపిణీ చేశారు. కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత, వైద్య సిబ్బంది సమక్షంలో విద్యార్థులకు మింగించారు. ముం దుగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యా ర్థులకు ఎంఈవో గౌరమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంతవరకు 94 శాతం మంది మాత్రలు పంపిణీ చేసినట్టు ఆరోగ్య విస్తరణాధికారి డీఎస్.మూర్తి తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శంకర్, అనూష, పవన్, రమణ, శ్రీదేవి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు పీహెచ్‌సీ పరిధిలో 95 శాతం మాత్రలు పంపిణీ చేసినట్టు మండల వైద్యాధికారి ఎం.దుర్గాదేవి తెలిపారు. 6092 మంది విద్యార్థులకు మాత్రలు అందించామన్నారు. హెచ్ఎంలు పప్పుశ్రీనివాసరెడ్డి, పి. వీరప్రభాకరరెడ్డి ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కడియం: మండలంలో 19 ఏళ్ల వయస్సు లోపలి వారికి సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు మాత్రలు మింగించడం జరిగిందని వైద్యాధికారి డా.ఎం.మణిజ్యోత్స్న తెలిపారు. 7,128 మంది లక్ష్యంగా కాగా 6,852 మందికి మాత్రలు పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో డా. ఎన్ నాగసాయిమౌర్య, ఆరోగ్య విస్తరణాధికారి ఎం. రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలల్లో 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల 8,392 మంది పిల్లలకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆల్బెండోజల్ మాత్రలు వేయించడం జరిగిందని వైద్యాధికారిణి వేణుశ్రీలక్ష్మీ తెలిపారు. రాజమహేంద్రవరం డీఎంహె చ్‌వో కార్యాలయం నుంచి ప్రోగ్రామ్ ఆఫీసర్ షమ్మికుమార్ రంగంపేట హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో అత్యధిక శాతం మంది నులిపురుగులతో బాధపడుతుంటారని రాజమండ్రి యూపీహెచ్‌సీ ఛైర్మన్ అనుసూరి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినం సందర్భంగా స్థానిక 5వ డివిజన్ కంబాలపేట చున్నిలాల్ జాజు మున్సిపల్ స్కూల్, ఎస్‌కేవీటి స్కూల్, అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య, అర్బన్ డీఐ దిలీప్‌కుమార్‌లతో కలసి అల్బెండజోల్ - 400 మిల్లీగ్రాముల మాత్రలను పిల్లలకు వేశారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షుడు రమేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


చిన్నారులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ అనూహ్య, పీహెచ్‌సీ చైర్మన్ ఏవీ శ్రీనివాస్

జిత్ మోహన్ మిత్రకు సన్మానం


జిత్ మోహన్ మిత్రను సన్మానిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ రాజమండ్రి మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్ గుండు వారి వీధిలోని గోదావరి ఫంక్షన్ హాల్లో సోమవారం నట గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్రను సత్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ నట గాయకుడు జిత్ మోహన్ మిత్రను మహిళా లయన్స్ క్లబ్ తరపున సత్కరించుకోవడం గర్వ కారణమన్నారు. మాటూరి మంగతాయారు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు అల్లాడ కవిత, గొందేశి మాధవీలత, పింజర్ల అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు వినియోగించిన కార్లకు అద్దెలు చెల్లించాలంటూ ధర్నా


కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులు పర్యవేక్షణ చేయడానికి వచ్చిన అధికారులకు ప్రభుత్వ కార్యాలయాల అవసరం కోసం అద్దె ప్రాతిపదికన పెట్టుకున్న 115 కార్లకు అద్దె బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చికర్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 మార్చి నుంచి డిసెంబరు వరకు రూ. నాలుగు కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయన్నారు. ఈ మేరకు కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందించారు. దీనిపై చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారని సత్యనారాయణ తెలిపారు.

కోటిపల్లి బస్టాండ్ - రోడ్డు కం రైలు బ్రిడ్జి రోడ్డు పరిశీలన

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ నుంచి రోడ్డుకం రైలు బ్రిడ్జికి వెళ్లే రోడ్డును కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. సోమవారం ఈ సెంటర్ నుంచి రోడ్డును చూసి అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రానున్న పుష్కరాలకు ఈ రోడ్డు చాలా కీలకం అవుతుందని, డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని బ్రిడ్జి ప్రవేశ మార్గంలో రంగులు వెలసిపోయాయని వాటిని పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు.

వైరస్ కట్టడికి చర్యలు : కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కోళ్ల పెంపకం, విక్రయ కేంద్రాల్లో ఏవీయన్ ఇన్‌ఫ్లూయెన్‌జా వైరస్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ అధికారులతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో పెరవలి, కానూరులో ఉన్న కోళ్ల ఫారాల్లో కోళ్లకు ఏవీయన్ ఇన్‌ఫ్లూయెన్‌జా వైరస్ సోకిందని పశుసంవర్ధక శాఖాధికారులు ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రాంతాల నుంచి కోళ్ల రవాణాను కట్టిడి చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలో కోళ్ల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. వ్యాపారులకు పలు సూచనలు చేశామన్నారు. వైరస్ సోకిన ప్రాంతాల కోళ్లను కొనుగోలు చేయవద్దని చెప్పామన్నారు.

స్వామివారికి అన్నకూటోత్సవం

కడియం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దుళ్ల శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో కార్యక్రమాలు మొదలయ్యాయి. అనంతరం స్వామివారికి వివిధ రకాల ఫలాలు, ఫలహారాలతో అన్నకూటోత్సవం నిర్వహించారు. సాయంత్రం సదస్యం, అనంతరం సహస్ర దీపాలంకరణసేవ కనుల పండుగగా జరిగింది. రాత్రి స్వామి వారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి

● ఏపీటీఎఫ్ సమావేశంలో తీర్మానం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) సమావేశంలో తీర్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం రాజమహేంద్రవరం నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ కె.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ ప్రగతి ఎడిటోరియల్ సభ్యుడు ఏఎస్ నాయుడు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఉదయబ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్, వి.అప్పయ్యశాస్త్రి, వైవీ రామారావు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతను గుర్తెరగాలి

● వ్యవసాయ విస్తరణాధికారి వేణుమాధవరావు


వేణుమాధవరావును సత్కరిస్తున్న వ్యవసాయ శాఖ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరగాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయిన అర్బన్ వ్యవసాయ విస్తరణాధికారి వేణుమాధవరావును వ్యవసాయాధికారులతో కలిసి సోమవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేణుమాధవరావు మాట్లాడుతూ ఏఈవోల సంఘానికే కాకుండా, వ్యవసాయశాఖలో వున్న అందరి ఉద్యోగుల సమస్యల పట్ల అవగాహన వుందన్నారు. కార్యక్ర మంలో వ్యసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, నగర ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు మీసాల మాధవరావు, వ్యవసాయాధికారులు భీమారావు, శాంతాఅలివ్, ద్వారాకాదేవి, సరళ, కాసిం, నాగేశ్వరరావు, దుర్గబాబు డివిజన్ పరిధిలో గల ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా



ఇళ్ల స్థలాల కోసం ధర్నా చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పేర్కొన్నారు. సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఇళ్లు లేని పేదలతో కలసి సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ నాయకులు కొండలరావు, సప్ప రమణ, ఎస్.నౌరోజీ, పి.లావణ్య, టి.నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, ఏఐవైఎఫ్, జట్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం చేయాలి : ఆర్డీవో


సర్వేయర్ల సమీక్షలో ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ పరిధిలో భూముల రీసర్వే వేగవంతం చేయాలని ఆర్డీవో కృష్ణనాయక్ సర్వేయర్లను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రీ సర్వేకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు, పీజీఆర్‌సీ గ్రీవెన్స్ త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా నిలుపుదల

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి విజయకుమారి వెల్లడి


రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోళ్లకు ఏవీయన్ ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా వారం రోజులపాటు నిలుపుదల చేస్తున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి విజయకుమారి సోమవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు అంగన్వాడీ సీడీపీవోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత సరఫరా ఏజెన్సీకి ఈమేరకు సమాచారం ఇచ్చామని, అలాగే ఉన్నతస్థాయి అధికారులకు కూడా తెలియజేశామని పేర్కొన్నారు.

గంజాయితో.. ముగ్గురి యువకుల అరెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఉన్న ముగ్గురు యువకులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ మంగాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీపేట రైల్వే క్వార్టర్స్ రోడ్డులో ఓ పాడుబడిన షెడ్డులో గంజాయి తాగుతున్న ధవళేశ్వరానికి చెందిన మహితేజ, ఐఎల్‌టీడీ ప్రాంతానికి చెందిన కె.నవీన్, బొమ్మూరుకు చెందిన ఎన్.శ్రీదుర్గాప్రసాద్‌ను సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గతంలో వీళ్లపై గంజాయి వినియోగం, సరఫరా కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | 5

ప్రజలు ఆందోళన చెందవద్దు..



ప్రజలు ఆందోళన చెందవద్దు. వైరస్ వ్యాప్తి చెందకుండా అధికార బృందం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. గ్రామం, పౌల్ట్రీ సంబంధిత ప్రదేశాల్లో అధికారులు శానిటేషన్ ప్రక్రియ చేపట్టారు. కొద్ది రోజుల పాటు గ్రామస్తులు చికెన్, గుడ్లు తినవద్దు.పరిస్థితిని బట్టి ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. - **కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి**



కలెక్టరేట్ వద్ద స్టాల్ ప్రారంభిస్తున్న కలెక్టర్

18 మండలాల్లో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్స్

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన ప్రకృతి వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయ స్టాల్‌ను జిల్లా వ్యవసాయాధికారి మాధవరావుతో కలిసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 38,061 మంది రైతులు 40,268 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. గతే డాది నుంచి జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద విక్రయిస్తున్నారన్నారు.మోడల్ మండలం గోకవరంలో కొత్తపల్లి, కామరాజుపేట, తిరుమలాయపాలెం, ఎర్రంపాలెం, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయోత్పత్తులు విక్రయిస్తున్నట్టు డీఏవో మాధవరావు తెలిపారు.కార్యక్రమంలో జేపీఈ వరలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 146 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు-2025లో భాగంగా జనరల్ విద్యార్థులకు 58 కేంద్రాల్లో కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ప్రాక్టికల్స్ నిర్వహించామని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఒకేషనల్ విభాగంతో కలిపి మొత్తం 6,287 మంది విద్యార్థులకు 146 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఎర్రకాలువ శాశ్వత పనులకు రూ. 268.5 కోట్లు ఇవ్వండి
కేంద్ర మంత్రికి ఎంపీ వినతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ శాశ్వత అభివృద్ధికి రూ. 268.5 కోట్లు ఇవ్వాలని కోరుతూ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వినతిపత్రం ఇచ్చారు. ఢిల్లీలో సోమవారం ఆయనను స్వయంగా కలసి ఎర్రకాలువ వరద ప్రభావం వల్ల జరుగుతున్న నష్టాన్ని వివరించారు. తక్షణం చేయవలసిన పనులు,వాటి వ్యయ అంచనాలు అందజేశారు.

స్కూల్ ఆటో బోల్తా ఏడుగురికి గాయాలు

భూ రీసర్వేపై కలెక్టర్ ఆరా 8

బర్డ్ ఫ్లూకి.. చిక్కెన్!



తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో బర్డ్ ఫ్లూతో చనిపోయిన కోళ్లను గోతిలో పాతిపెడుతున్న యజమానులు

కోళ్లకు వైరస్.. ఆందోళనలో జనం



- కానూరులో నిర్ధారణ
- 62 వేల కోళ్లు మృత్యువాత
- 10 రోజులుగా విలవిల
- యజమానుల సమాచారం
- స్పందించిన కాకినాడ సిబ్బంది
- భోపాల్ లేబోరేటరీకి శాంపిల్స్
- ఆదివారం ధ్రువీకరణ
- చికెన్ మార్కెట్ ఢమాల్
- లబోదిబోమంటున్న రైతులు

రాజమహేంద్రవరం/ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చూస్తుండగానే కోళ్ల మృత్యువాతపడుతున్నాయి..ఉన్నట్టుండి తలలు వాల్చేస్తున్నాయి..కొన్ని కోళ్ల అయితే కొట్టుకుని చచ్చిపోతున్నాయి. నిన్నటి వరకూ కోళ్లతో కళకళలాడిన కోళ్ల ఫారాలు ప్రస్తుతం శ్మశానాన్ని తలపిస్తున్నాయి.ఎందుకంటే చనిపోయే కోళ్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో తూర్పుగోదావరి జిల్లా ప్రజల్లో ఆందోళన పెరిగింది. నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని రామకృష్ణా పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్ సోకింది.ఇది ఏవీఎన్ ఇన్ ఫ్లూయేంజాలో ఒకరకం.ఆ గ్రామంలో ఉన్న మూడు ఫారాల్లో మొత్తం 64 వేల కోళ్ల ఉండగా ఇప్పటికే సుమారు 62 వే... లు చనిపోయాయి.కానూరు అగ్ర... హారంలో ఈ నెల ఒకటో తేదీ నుం... చే కోళ్ల చనిపోతున్నట్టు అధికా రు... లకు సమాచారం వచ్చింది.ఈ మేరకు కాకినాడకు చెందిన లేబొరేటరీ సిబ్బంది వచ్చి పరీక్షించి 83 శాంపిల్స్‌ను మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్ ఉన్న నేషనల్ హైసెక్యూరిటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబోరేటరీకి పంపించారు.వీటిని మూడు రకాలుగా పంపించారు. మూడు చనిపోయిన కోళ్ల శాం పిల్స్, 40 కోళ్ల ముక్కు టెస్ట్, మరో 40 కోళ్ల రెట్ట శాంపిల్స్‌ను పంపించారు. చనిపోయిన మూడు కోళ్లలో రెండు కోళ్లకు బర్డ్ ఫ్లూ ధ్రువీ కరణ అయింది.ఈ మేరకు ఆదివారం సాయంత్రం రిపోర్టు పంపారు.మిగతా శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉంది. సుమారు 10 రోజులుగా బర్డ్ ఫ్లూ అనే ప్రచారం జరిగినా పౌల్ట్రీ రైతులు, పశు సంవర్ధక శాఖాధికారులు పట్టించుకోలేదు.దీంతో పరిస్థితి ఇంత వరకూ వచ్చింది.విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పశు సంవర్ధక సిబ్బందికి షోకాజ్ నోటీసులివ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. కానూరు అగ్రహారం, నల్లజర్ల, చాగల్లు,సీతానగరం మండలం మిర్తి పాడు తదితర ప్రాంతాల్లో కోళ్లు చనిపోతున్నట్టు సమాచారం.దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.జిల్లాలో అన్ని మాంసం దుకాణాలు తనిఖీలు చేస్తున్నారు. జాగ్రత్తలు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఇది మనుషులకు సోకవచ్చు..

బర్డ్‌ఫ్లూ మనిషికి సోకే ప్రమాదం ఉంది. విపరీతంగా జలుబు, ఊపిరాడకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.ఇది ఒక విధమైన కరోనా లక్షణం. కానూరు అగ్రహారం పరిసర ప్రాంతాలైన 34 గ్రామాలకు 34 టీమ్‌లను పంపిస్తున్నాం. అక్కడ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వైద్యశాఖకు కూడా తెలిపి, అక్కడి పనివారికి కూడా పరీక్షలు నిర్వహించాం. కోళ్లఫారంలో పనిచేస్తున్నవారికి ఎటువంటి రోగ నిర్ధారణ జరగలేదు.

- టి.శ్రీనివాస్, పశుసంవర్ధక జిల్లా అధికారి

చికెన్, గుడ్లు తినవద్దు..
కలెక్టర్ ప్రశాంతి

కొద్ది రోజుల పాటు చికెన్, గుడ్లు తినవద్దు. కానూరు అగ్రహారం గ్రామానికి 10 కి.మీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గ్రామంలో ఒక కిలోమీటరు మేర రెడ్ జోన్‌గా.. 10 కిలోమీటర్ల పరిధిలో సర్వే లెన్స్ జోన్‌గా ప్రకటించాం. ఇక్కడ పోలీసులు 144, 133 సెక్షన్లు అమల్లోకి తెచ్చారు. ఎక్కడ బర్డ్స్ చనిపోతున్నా అధికారులకు సమాచారం ఇవ్వండి.గత వారంలో ఇక్కడి పౌల్ట్రీల నుంచి కోళ్ల రవాణా ఎక్కడికి జరిగిందో సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించాం. 10 కి.మీ పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల్లో ఏమైనా బర్డ్‌ఫ్లూ లక్షణాలుంటే ఆరా తీసి వైద్య సహాయం అందిస్తాం.రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామని.95429 08025 నెంబర్‌లో డాక్టర్ భరత్ అందుబాటులో ఉంటారు. ప్రతి మండలంలోనూ ఇంటింటికీ రెండు శాతం క్లోరైడ్ పిచికారీ చేయాలి.

కరోనా.. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఒకటే

బర్డ్‌ఫ్లూ, కరోనాకు కూడా ఒకే లక్షణాలు ఉంటాయి. ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లు మెడలు వాలేసి ఆకస్మికంగా ప్రాణాలు వదిలేస్తాయి. ఇది ఒక వైరస్. అంటువ్యాధి. రకరకాల కారణాలతో ఈ వైరస్ దాపురిస్తుంది.

అంగన్‌వాడీలకు గుడ్లు నిలిపివేత

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్లు పంపిణీ నిలిపివేసినట్టుజిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి కె.విజయకుమారి తెలిపారు. వారం రోజుల పాటు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.ఈ మేరకు సీడీపీవోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు.

కానూరులో పక్షుల వేట

కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామంలో కిలో మీటరు మేర ఏ రకమైన పక్షలు ఉన్నా వెంటనే చంపేసి పాతి పెట్టాలని ఆదేశాలిచ్చారు. ఈ వ్యాధికి వ్యాక్సిన్ లేదు. వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టాలంటే కోళ్లు, బాతులు,ఇతర పక్షులేవైనా సరే చంపేయడమే మార్గమని అధికారులు చెబుతున్నారు.చంపేసిన వాటిని ఒక్కో గోతిలో 1800 కోళ్ల వంతున పాతిపెట్టేయాలని ఆదేశించారు. కోళ్లతో పాటు ఇతర పక్షి జాతి కూడా ఉండకూదన్నారు.

పడిపోయిన మార్కెట్..

జిల్లాలో సుమారు 250 కోళ్ల ఫారంలలో 2 కోట్ల 60 లక్షల కోళ్లు ఉన్నాయి.బర్డ్ ఫ్లూ ప్రబలడంతో జిల్లాలో కోడిమాంసం, గుడ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. చికెన్, గుడ్లు తినడానికి ప్రజలు భయపడు తున్నారు.చాలా చోట్ల దుకాణాలు వెలవెల బోతున్నాయి. వాస్తవానికి ఉడకబెట్టిన తర్వాత ఏ ప్రభావం ఉండదని చెబుతున్నప్పటికీ ప్రజలు మాత్రం తినడం మానేశారు.

కానూరు అగ్రహారంలో అధికారుల పరిశీలన



కానూరు అగ్రహారం పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా వచ్చాయని పశుసంవర్ధక శాఖ డీడీ ఎస్.సత్యనారాయణ తెలిపారు. పశు సంవర్ధక, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులు సోమవారం గ్రామానికి విచ్చేసి కోళ్లఫారాలను పరిశీలించి మాట్లాడారు. కిలోమీటరు పరిధిలో ఉన్న పౌల్ట్రీ కోళ్లతో పాటు నాటు కోళ్లకు వ్యాధి సోకుతుందన్నారు. ప్రస్తుతం రెండు ఫారాల్లో మిగిలిన కోళ్లు చనిపోతాయన్నారు. మండలంలో మిగిలిన ఫారాలకు వైరస్ సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ డి.అచ్యుతకుమారి మాట్లాడుతూ కానూరు అగ్రహారంలోని 10 కిలోమీటర్ల పరిధిలో కోళ్లఫారాల నుంచి ఎటువంటి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.





కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా.. అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్ 7

ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ

ఏలూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వస్తున్న ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు.. (పక్కన ఇన్‌సెట్‌)లో కేంద్రమంత్రి వర్మ, రాష్ట్ర మంత్రులు దుర్గేష్, సుభాష్, రామానాయుడు తదితరులు

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి చివరి రోజు భారీగా నామినేషన్ల దాఖలు 7

- మొత్తం 59 మంది అభ్యర్థులు.. 72 సెట్ల నామినేషన్లు
- ముగిసిన స్వీకరణ గడువు
- నేడు పరిశీలన..13 వరకు ఉపసంహరణ

ఓపీకి వస్తే..బీపీ!

- ఓపిక ఉంటేనే జిల్లా ఆసుపత్రికి రావాలి
- అనారోగ్యంతో ఒక్కరే వచ్చారా అంతే
- రోగుల అష్టకష్టాలు.. నిర్లక్ష్యంగా సిబ్బంది



జిల్లా ఆసుపత్రిలో ఓపీకి భారీ క్యూ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) ... అదేనండీ పెద్దాసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారా ? అయితే ఆసుపత్రికి తప్పనిసరిగా ఇద్దరు రావాల్సి ఉంటుంది. వైద్యం కోసం వచ్చే వ్యక్తితో పాటు మరొకరు తోడు ఉండాలి. వెంట సెల్‌ఫోన్ తెచ్చుకోవడం మరిచిపోవద్దు. ఎందుకంటే ఓపీ చీటీ రాయించుకునే క్రమంలో ఒకరిని ఓపీ చీటీలు జారీ చేసే కంప్యూటర్ విభాగం క్యూ లైనులో నిలుచోబెట్టాలి. మరొకరు సెల్‌ఫోన్ తీసుకెళ్లి మరో చోట ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకుని రావాలి. ఆ సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగానే కంప్యూటర్‌లో చీటీ జనరేట్ చేస్తారు. ఒక వేళ ఒక్కరే గనుక ఆసుపత్రికి వస్తే ఓపీ చీటీ చేతికి రావడానికి కనీసం రెండు, మూడు గంటలు పడుతుంది. దగ్గు, జలుబు, జ్వరం..ఇలా ఏ చిన్న రోగమైనా సరే ఓపీ రిజిస్ట్రేషన్ పూర్తయితేనే వైద్యం చేయించుకోవడానికి అర్హత లభిస్తుంది.ఆ సమయానికి డాక్టర్ గారు ఉంటే ఉండొచ్చు లేకపోతే లేదు.

రోగులకు తప్పని తిప్పలు..

సోమవారం జీటీజీహెచ్‌కు వైద్యసేవల కోసం పెద్ద సంఖ్యలో వచ్చారు. సోమవారం ఓపీ రష్‌గా ఉంటుందని భారీగా రోగులు వస్తారని తెలిసినా ఆసుపత్రి అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాటు చేయకపోవడంతో రోగులు, వారి సహాయకులకు తిప్పలు తప్పలేదు.మహిళా విభాగంలో కేవలం ఇద్దరు సిబ్బందిని మాత్రమే రిజిస్ట్రేషన్లు చేసేందుకు నియమించారు. సర్వర్ పనిచేయడంలేదని కొంతసేపు, డైరెక్టుగా వెళ్లి ఓపీ చీటీలు తీసుకోవాలని మరికొంతసేపు రోగులు, వారి సహాయకులను గందరగోళానికి గురి చేశారు. కొంతసేపటి తర్వాత రిజిస్ట్రేషన్లు అవడంలేదని వీళ్ల చేతులెత్తేశారు. మహిళలంతా మళ్లీ ఈసురోమంటూ కంప్యూటర్ విభాగం వద్దకు పరుగులు పెట్టారు. పది గంటల తర్వాత పురుషుల విభాగం వద్ద రిజిస్ట్రేషన్లు చేసేందుకు సిబ్బంది లేకపోవడం గమనార్హం. పురుషుల ఓపీ చాంతాడంత క్యూలు దర్శనమివ్వగా, మహిళల ఓపీ విభాగంలోనూ తీవ్రమైన రద్దీ కనిపించింది. అసలే రోగాలతో ఆసుపత్రికి వచ్చిన వారికి ఈ పరిస్థితి మరింత నీరసం తెప్పించింది.రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) తీరు మారడంలేదు. ఎక్కడెక్కడి నుంచో ఎన్నో వ్యయప్రయాసలతో ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది.

భోజనం ఎలా ఉంటుంది?
విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డీఈవో



తాళ్లపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరికీ మంచి బోధనతో పాటు భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో మిడ్‌డే మీల్స్‌ను సోమవారం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజూ భోజనం ఎలా ఉం టుందని విద్యార్థులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 24,763, 10,553 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరవు తారన్నారు. 404 పాఠశాలల నుంచి 134 సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నులి పురుగులను చంపేద్దాం!
ఆల్బెండజోల్ మాత్రలు వేసిన కలెక్టర్



తాళ్లపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆరు నెలలకోసారి నులి పురుగుల నివారణకు అల్బెండాజోల్ మాత్రలు వేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం పురస్కరించుకుని వేగేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో అల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమం 94.8 శాతం మేర పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 17వ తేదీన అందజేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

సూర్యనారాయణుడికి మంగళస్నానాలు


రావణబ్రహ్మ శివాలయ క్షేత్రంలో సౌరయాగం దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సూర్య నారాయణుడికి శాస్త్రోక్తంగా మంగళ స్నానాలు నిర్వహించారు. కొవ్వూరు శ్రీనివాస స్నానఘట్టంలో ప్రకృతి రావణబ్రహ్మ శివాలయ క్షేత్రంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగం 12వ రోజుకు చేరుకుంది. సోమవారం సూర్య ఉపాసకుడు విక్రమాదిత్య ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, సూర్య నమస్కారాలు సమర్పించారు. ఉష సౌజ్ఞ, చాయాదేవి, సూర్యనారాయణ ఉత్సవ మూర్తులకు గోదావరి జలాలతో భక్తులు మంగళస్నానాలు చేయించారు. కాగా మంగళవారం యాగం అనంతరం స్వామి వారికి శాంతి కల్యాణం, రథోత్సవం జరుగుతాయని విక్రమాదిత్య పేర్కొన్నారు.

పురుషోత్తపల్లిలో నూతన ఇసుక ర్యాంపు!

ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత


ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఆర్డీవో సుస్మిత

నిడదవోలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో నూతన ఇసుక ర్యాంపుపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చునని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. గ్రామంలో నూతన ఇసుక ర్యాంపు ఇచ్చేందుకు సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రభుత్వం పురుషోత్తపల్లిలో ఇసుక ర్యాంపునకు ప్రతిపాదనలు చేసిందని, గ్రామస్థులకు అభ్యంతరం లేకపోతే ర్యాంపు మంజూరవుతుందని ఆర్డీవో అన్నారు. అనంతరం పలువురు గ్రామస్థులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ పణి భూషణ్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ శంకరరరావు, తహశీల్దార్ నాగరాజునాయక్, సమిశ్రగూడెం ఎస్‌ఐ కె.వీరబాబు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

కొవ్వూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలోని సాగు నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రిని కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు అందించారు. నియోజకవర్గంలోని మరమ్మతులకు గురయిన ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ పంట కాలువలను పూర్తిస్థాయిలో పూడిక తీతలకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని కోరారు.

కోడికి..వైరస్!


నిడదవోలులో వెలవెలబోతున్న చికెన్ షాపు

- కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్
- కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న షాపులు
- భారీగా పడిపోయిన ధరలు

నిడదవోలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాంసాహార ప్రియులకు ఆరోజు ఈరోజు అంటూ పట్టింపు ఏమీ ఉండదు. తినాలనిపిస్తే చాలు చికెన్ షాపు ముందు వాలిపోతారు. ఎప్పుడు కళకళలాడుతూ ఉండే చికెన్ షాపులు కొద్దిరోజులుగా కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. గోదావరి జిల్లాల్లో కోళ్లకు వైరస్ వచ్చిందనే ఊహాగానాలే అందుకు కారణం. దీంతో మాంసాహార ప్రియులంతా కొద్దిరోజులుగా శాఖాహార ప్రియులుగా మారిపోయారు. దీంతో చికెన్ ధర సైతం చిక్కిపోయింది. బ్రాయిలర్ చికెన్ కిలో రూ.280 నుంచి రూ.160కు ఫారమ్ కోడి చికెన్ కిలో రూ.240 నుంచి రూ.140కు పడిపోయింది. నిడదవోలులోని సంత మార్కెట్‌లో సోమవారం చికెన్ షాపు వద్ద కొనుగోలుదారులు లేక వెలవెలబోయింది.

విక్రయాలు బంద్

నల్లజర్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో చికెన్ దుకాణాలు బంద్ అయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో చికెన్ విక్రయాలు నిర్వహించవద్దని తహశీల్దార్ నాయుడు ఆదేశాలు జారీ చేశారు. కోళ్లకు ఏవీయన్ ఇన్‌ఫ్లుయెన్‌జా వైరస్ వచ్చి వేల సంఖ్యలో మృత్యువాత పడ్డాయని, చికెన్ విక్రయాల ద్వారా ఈ వైరస్ మరింత ఉధృతమయ్యే ప్రమాదముందని గ్రహించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు నెల రోజుల పాటు చికెన్‌కు దూరంగా ఉండాలని, కూరగాయల భోజనం ఆరోగ్యానికి మంచిదని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా బహిరంగంగా చికెన్ విక్రయాలు బంద్ కావడంతో కొంత మంది వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు.


అచ్చన్నపాలెంలో బర్డ్‌ఫ్లూ వైరస్‌తో చనిపోయిన కోళ్లు

అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా నిలుపుదల

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి విజయకుమారి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కోళ్లకు ఏవీయన్ ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా వారం రోజులపాటు నిలుపుదల చేస్తున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి విజయకుమారి సోమవారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు అంగన్వాడీ సీడీపీవోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత సరఫరా ఏజెన్సీకి ఈమేరకు సమాచారం ఇచ్చామని, అలాగే ఉన్నతస్థాయి అధికారులకు కూడా తెలియజేశామని పేర్కొన్నారు.

ఆవపాడులో చండీ హోమం

నల్లజర్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవత ముత్యాలమ్మకు జనసేన సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. అమ్మవారికి ఈ నెల 4న చేపట్టిన పూజలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా మహామృత్యుంజయ, పాశుపత శ్రీ రుద్ర మహా యాగం చేపట్టారు. మహా పూర్ణాహుతి, అనంతరం అన్న సమారాధన జరిపారు.

వైరస్ కట్టడికి చర్యలు

కోళ్ల పెంపకం, విక్రయ కేంద్రాల తనిఖీలో కమిషనర్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరంలో కోళ్ల పెంపకం కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కోళ్ల పెంపకం, విక్రయ కేంద్రాల్లో ఏవీయన్ ఇన్‌ఫ్లుయెన్‌జా వైరస్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ అధికారులతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో పెరవలి, కానూరు గ్రామాల్లో ఉన్న కోళ్ల ఫారాల్లో కోళ్లకు ఏవీయన్ ఇన్‌ఫ్లుయెన్‌జా వైరస్ సోకిందని పశుసంవర్ధక శాఖాధికారులు ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రాంతాల నుంచి కోళ్ల రవాణాను కట్టిడి చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలో కోళ్ల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. వ్యాపారులకు పలు సూచనలు చేశామని కేతన్ గార్గ్ పేర్కొన్నారు. వైరస్ సోకిన ప్రాంతాల కోళ్లను కొనుగోలు చేయవద్దని చెప్పామన్నారు. నగరంలో కోళ్ల పెంపకం కేంద్రాలు, అమ్మకం కేంద్రాలను పరిశీలించి రిపోర్టును సమర్పించాలని పశుసంవర్ధక శాఖాధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా కొన్నిరోజుల పాటు చికెన్ కొనుగోలు చేసే విషయంలో అప్రమత్తంగా వుండి, కోనుగోలు ప్రాంతాల గురించి తెలుసుకుని పరిశీలించుకోవాలని సూచించారు.

భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు

- స్నానఘట్టాలు శుభ్రంగా ఉండాలి
- పడవులు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచండి
- తాత్కాలిక మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటుచేయండి
- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
- మహాశివరాత్రికి గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లపై సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సుస్మిత, పాల్గొన్న అధికారులు

కొవ్వూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. మహాశివరాత్రికి గోష్పాదక్షేత్రంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహాశివరాత్రికి గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. స్నానఘట్టాల్లో నాచును, ఇసుక మేటలను తొలగించి ఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జల్లు స్నానాలు ఏర్పాటు చేయాలన్నారు. నదిలో ప్రమాదాలు జరగకుండా మెస్‌లు, పడవులు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆర్డీవో సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటుచేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే డివిజన్ పరిధిలోని వేగేశ్వరపురం, తాళ్లపూడి, ప్రక్కిలంక, వాడపల్లి, సిద్ధాంతం, పెండ్యాల, ముక్కామల గోదావరి స్నానఘట్టాలను శుభ్రపరిచి, విద్యుత్ లైటింగ్, పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాలని డివిజనల్ పంచాయతీ అధికారికి వివరించారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుని భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని తహశీల్దార్ దుర్గాప్రసాద్‌ను ఆదేశించారు. అయితే శివరాత్రి ఏర్పాట్లకు ఎటువంటి నిధులు లేవని భారంగా మారుతుందని అధికారులు తెలియజేశారు. దీనిపై క్షేత్రంలోని సుమారు 14 దేవాలయాలు ఉన్నాయని వారంతా ఖర్చును భరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు, ఎలక్ట్రికల్ ఏడీఈ ఎం.కృష్ణనాయక్, టౌన్ ఏఈ డి.జగదీశ్వరరావు, రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ పి.సాయిబాబు, అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ఎస్.వేణు, శివాలయం అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు, ఎస్.ధర్మరాజు, మత్స్యశాఖ, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో రీసర్వే చేయాలి : జేసీ


గుడ్డిగూడెంలో సర్వేపై వివరాలు తెలుసుకుంటున్న జేసీ చినరాముడు

గోపాలపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీసర్వేను రైతుల సమక్షంలో పారదర్శకంగా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కొనసాగుతున్న రీసర్వేను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే సమయంలో ఆయా సర్వే నెంబర్లకు సంబంధించిన రైతులందరికీ సమాచారం ఇచ్చి వారి సమక్షంలో రీసర్వే చేయాలన్నారు. రైతులు భూముల విషయంలో సుదీర్ఘంగా ఎదు ర్కొంటున్న సమస్యలకు ఈ రీసర్వే పరిష్కారం చూపుతుందన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వెంట తహశీల్దార్ కె.అజయ్‌బాబు, సర్వేయర్ తులసి, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

రీసర్వే తీరుపై కలెక్టర్ ఆరా

తాళ్లపూడి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పంచాయతీ కార్యాలయంలో సోమవారం రీ సర్వేపై రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లతో కలెక్టరు పి.ప్రశాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే సమయంలో రైతులు, భూముల యజమానులతో వ్యవహరిస్తున్న తీరు, పాటిస్తున్న నిబంధనలపై ఆరా తీసారు. రీసర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి తహశీల్దార్ భారతి, మండల సర్వేయర్ సత్యనారాయణ. ఆర్‌ఐ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకే ఆల్బెండజోల్

- ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పంపిణీ
- జాతీయ నులి పురుగుల నివారణ దినం


చిన్నాయిగూడెం హైస్కూల్లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

నిడదవోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ నులిపురుగుల నివారణకు అల్‌బెండాజోల్ మాత్రలను తీసుకోవాలని డాక్టర్ తేజశ్రీ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా సోమవారం నిడదవోలులోని నెహ్రూనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కలిగించి మాత్రలు పంపిణీ చేశారు. 1నుంచి 18ఏళ్ల వయసున్న విద్యార్థులందరూ 400 మిల్లీగ్రాముల అల్‌బెండాజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల నివారణ సాధ్యపడుతుందని తేజశ్రీ అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చిట్టి, కోటాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వూరు: దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో 5112 మందికి అల్‌బెండాజోల్ మాత్రలు వేసినట్టు వైద్యాధికారి డాక్టర్ ఎస్.ధర్మరాజు తెలిపారు. మొత్తం 5438 మంది విద్యార్థులకు గాను సోమవారం 5112మంది (94శాతం)కి మాత్రలు వేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు 62 మంది సిబ్బంది పాల్గొన్నారన్నారు.

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ పరిధిలోని బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, దారవరం, ఎస్ ముప్పవరం, నందిగంపాడు గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగు నివారణకు వైద్యాధికారి నిషిత పర్యవేక్షణలో సిబ్బంది అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పీఆర్ఎల్ దేవి, హెల్త్‌సూపర్‌వైజర్ శారమ్మ, రామచంద్రరావు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో ఉండ్రాజవరం, వేలివెన్ను పీహెచ్‌సీల పరిధిలోని 15 గ్రామాల్లో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల కడుపులోని నులిపురుగుల నివారణ, రక్తహీనత నుంచి విముక్తి పొందవచ్చని వైద్యాధికారులు తెలి పారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆర్.ప్రసాద్, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఈ మాత్రలు పంపిణీ చేశారు.

దేవరపల్లి: మండంలోని దేవరపల్లి, గౌరీపట్నం, యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలు అందజేశారు. వైద్యాధికారులు సీహెచ్ హరిచందన, డి.సాంబశివరావు, కె.సతీష్ మాట్లాడుతూ విద్యార్థులకు శరీరంలో నులిపురుగులు ఉండటం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు అల్‌బెండాజోల్ మాత్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రశాంతి, సీహెచ్‌వో శ్రీకృష్ణుడు, డి.సంజీవ్, హెల్త్‌సూపర్‌వైజర్ పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.


ఉండ్రాజవరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

రాజశేఖర్‌ను గెలిపించండి

దేవరపల్లి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని మండలంలోని లక్ష్మీపురం, పల్లంట్ల గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యం లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. లక్ష్మీపురంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు పల్లంట్లలో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పులూరి రాంబాబు, నున్నా చిన్ని, యాగంటి వెంకటరత్నం, పోలుమాటి నాని, కొమారపు చంద్రశేఖర్, డి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలని పట్టభద్రులైన ఓటర్లను కలసి అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిన గోపాలకృష్ణ, జనసేన నాయకుడు జవ్వాది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం : మద్దిపాటి


వెంకట్రావు కుటుంబీకులకు ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పని చేసని ప్రతీ కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. రాజంపాలెం గ్రామానికి చెందిన దొడ్డిగర్ల వెంకట్రావు బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న ఉపసర్పంచ్ కాకర్ల జగదీష్, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కాకర్ల రామతులసి దంపతులు ఎమ్మెల్యే మద్దిపాటి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.6.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని సోమవారం ద్వారకా తిరుమల మండలం ఐఎస్.జగన్నాధపురంలో అందించినట్టు జగదీష్ దంపతులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ద్వారకాతిరుమల మండలాధ్యక్షుడు లంకా సత్యనారాయణ, వేమన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యానాదులకు ప్రత్యేక కమ్యూనిటీ హాలు నిర్మించాలి

కొవ్వూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యానాద కులస్తులకు కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని యానాదుల సంఘం నాయకుడు పొట్లూరి గాంధీ డిమాండ్ చేశారు. సోమవారం యానాదుల కాలనీవాసులు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేశారు. గాంధీ మాట్లాడుతూ కొవ్వూరులో 65 ఏళ్ల క్రితం కాలనీ స్థలాలు ఇచ్చారన్నారు. వర్షాకాలంలో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలోనే నివస్తున్నామన్నారు. కాలనీవాసులు వివాహాది శుభకార్యాలు, నెలసరి సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. యానాదులకు ప్రత్యేక కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని కోరారు.

స్కూల్ ఆటో బోల్తా

ఏడుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

నిడదవోలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాడిమళ్ల నుంచి నిడదవోలులోని ఓ ప్రయివేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకువస్తున్న ఆటో సోమవారం సూరాపురం వద్ద బోల్తా కొట్టింది. ప్రమాద సమయంలో ఆటోలో 11 మంది విద్యార్థులు ఉండగా ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. డ్రైవర్ మద్యం తాగి ఆటో నడపడం వల్ల అదుపు తప్పి బోల్తా కొట్టిందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. సమిశ్రగూడెం ఎస్‌ఐ కె.వీరబాబు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆసుపత్రిలో వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.


ఘటనా స్థలంలో ఆటో

పరస్పర దాడులు.. ఇద్దరిపై కేసులు

కొవ్వూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో పరస్ప దాడులు చేసుకున్న ఇద్దరు యువకులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. స్థానిక వేగివారి చావిడికి చెందిన కూండ్రపు కిషోర్ ఈ నెల 9వ తేదీ రాత్రి స్థానిక శ్రీరామ కాలనీలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. దారిలో బీసీ హాస్టల్ వద్ద బొండాడ అనీల్ చంపుతానని బెదిరించడంతో పాటు కుడి కన్నుపై, భుజంపై బ్లేడ్‌తో గాయపర్చాడు. మెడపై దాడి చేయబోతుండగా కిషోర్ తప్పించుకుని వెళ్లిపోయాడు. అలాగే కిషోర్ స్క్రూడ్రైవర్‌తో దాడి చేయడంతో అనీల్ తలకు తీవ్ర గాయమైంది. ఇద్దరూ చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. ఆసుపత్రి సమాచారం, పరస్పర ఫిర్యాదుల మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాఘువులను గెలిపించండి

ఏపీ యూటీఎఫ్ ఫెడరేషన్ అధ్యక్షుడు జయకర్

దేవరపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులను ప్రథమ ప్రాధాన్య ఓటుతో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు జయకర్ అన్నారు. దేవరపల్లిలో ప్రాథమిక మెయిన్ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవులను ఉద్యోగులు, నిరుద్యోగులు డిగ్రీ పట్టభద్రులు గెలిపించే విధంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలోనూ మనకు ఎటువంటి న్యాయం జరగలేదని ప్రస్తుత ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా పీడీఎఫ్ ఉంటుందని మన హక్కులు సాధించుకోవడానికి పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ యూటీఎఫ్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, శివరాజు, రామారావు, నరసింహ, ఉమాకాంత్, రమాజానకి, విజయ్‌బాబు, భూషణం, ఉదయ్, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జీతాలివ్వరు.. వేధింపులు ఆపరు

శ్రీసత్యసాయి మంచినీటి సరఫరా మెయింట్‌నెన్స్ వర్కర్స్ యూనియన్

గోపాలపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) ఒక పక్క పెండింగులో ఉన్న బకాయిలు మరోపక్క కాంట్రాక్టర్ వేధింపులు తాళలేక బ్రతికేది ఎలా అంటూ శ్రీసత్యసాయి మంచినీటి సరఫరా మెయిటెనెన్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు లబోదిబోమంటున్నారు. సోమవారం గోపాలపురంలోని శ్రీసత్యసాయి మంచినీటి స్కీమ్ వద్ద విలేకర్ల ఎదుట సోమవారం తమగోడును వెల్లబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి పథకంలో పని చేస్తున్న తమకు ఎనిమిది నెలలుగా జీతాలు పెండింగులో ఉన్నాయని, జీతాలు ఇవ్వకపోగా కాంట్రాక్టర్ అనుచరుడు తమను నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాల మాట తమ నోటి నుంచి వస్తే ఇక వేధింపులు మొదలవుతాయని నిరంతరం భయాందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్ర నోరుమెదపకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థంకావడంలేదన్నారు. పలుమార్లు జిల్లా కలెక్టర్లకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. టెండర్ అగ్రిమెంట్ ప్రకారం ప్రభుత్వం ఇచ్చే బిల్లులతో సంబంధం లేకుండా కాంట్రాక్టరే ప్రతీ నెల జీతాలతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించాలని నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టరు నిమ్మకునీరెత్తి నట్టు వ్యవహరిస్తున్నాడని యూనియన్ సభ్యులు ఆవేదన చెందారు. సత్యసాయి మంచినీటి సరఫరా పథకంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారేమోనన్న అను మానాన్ని కలిగిస్తోందన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శివసత్యనారాయణ, ఆచంట సురేష్, బాబువరప్రసాద్, పోసిబాబు, రవీంద్ర, దాసరి రవి, పుచ్చకాయల ప్రసాద్ పాల్గొన్నారు.